VISALAANDHRA VIJAYAWADA PHONE No. 376

4 పేజీలు 7 నయాపైసలు రిజిష్టరు నెం. 203 A

'విశాలాంధ్ర' పత్రిక

చందా వివరాలు

		ఏజంటుద్వారా		పోస్టుద్వారా
సంవత్సరం	...	28.00	...	30.00
ఆరు మాసాలు	...	14.00	...	15.00
మూడు మాసాలు	...	7.00	...	7.75
ఒక మాసం	...	2.40	...	2.60

విశాలాంధ్ర

706298

సంపుటి 12 | విజయవాడ • 22 అక్టోబరు 1962 • సోమవారం | సంచిక 196

భారత్‌కు ఇరాక్ నుండి నూనె సప్లయి

ఇరాక్ మంత్రి వెల్లడి

న్యూఢిల్లీ, అక్టోబరు 21

భారతదేశానికి ఇరాక్ క్రూడ్‌ఆయిల్ సరఫరాచేసే అవకాశం ఖచ్చితంగా కలదని నేడు ఇరాక్ నూనెశాఖామంత్రి శ్రీ మహ్మద్ సల్మాన్ తెలియజేశారు.

మన దేశంలో ఏడురోజులపాటువున్న సల్మాన్ ఇలా అన్నారు: "మీకు నూనె కావాలి, మావద్ద నూనె వుంది."

శ్రీ సల్మాన్ నేడు రాష్ట్రపతి డాక్టర్ రాధాకృష్ణన్, ప్రధాని నెహ్రూలను కలుసుకొని ఇరాక్ ప్రధానమంత్రి జనరల్ అబ్దుల్ కరీమ్ ఖాశిం సుహృద్భావ సందేశాన్ని వారికి స్వయంగా అందజేశారు.

నేఫా, లడక్ రంగాలలో భారత, చైనా సేనలమధ్య తీవ్రమైనపోరు

థోలా, ఖింజమానే చౌకీలు, పశ్చిమాన రెండుచౌకీలు భారతబలాలు ఖాళీచేసినట్లువార్తలు

నాంకా-చూ నదికి దక్షిణాన ప్రస్తుతం సంకుల సమరం

న్యూఢిల్లీ, అక్టోబరు 20

నేడు ఉదయం తీవ్రపోరాటం జరిగిన తర్వాత ఈశాన్య సరిహద్దులో ఖింజెమానెలోని భారత సరిహద్దు చౌకి పడిపోయింది. అలాగే థోలా చౌకినికూడ భారత సేనలు ఖాళీ చేశాయి.

లడక్ (చిప్‌చాప్ నది) ప్రాంతంలో మరింత ముందు రక్షణ స్థావరాలను ఏర్పరచుకొనడంకోసం భారత బలగాలు ఒకటి, రెండు చౌకీలను వదలివేశాయి.

థాగ్లా నదీరంగంలో గాయపడిన వారిని తరలించుకుపోతున్న ఒక భారత హెలీకాప్టర్‌ను చైనా బలగాలు కూలగూల్చాయి.

భారతసరిహద్దు కాపలాదళాలకంటె చాలా హెచ్చు సంఖ్యలో వున్న చైనా బలగాలు వరుసగా భారత స్థావరాల మీద తెరలు తెరలుగా దాడి చేస్తున్నాయి; చైనా బలాలు భారీ మోర్టార్లు, మధ్యరకం మరతుపాకులు ఉపయోగిస్తున్నాయి.

భారత సైనికులు ప్రతి అంగుళంలో సాహసంతో పోరు సలుపుతున్నారు; చైనావారికి "చాలా నష్టాలు" కలిగిస్తున్నారు.

మాక్‌మాహన్ రేఖకు దక్షిణాన మూడు నాలుగు మైళ్ళ దూరంలో నాంకా-చూ నదికి దక్షిణంగా కొద్ది దూరాన 20 మైళ్ళ పొడవున్న రంగంలో తీవ్ర పోరాటం సాగుతున్నది.

థాగ్లా కొండ (మాక్‌మాహన్ రేఖ) కూ, ప్రస్తుతం పోరు భీకరంగా జరుగుతున్న నాంకా-చూ నదిదాకా వున్న భారత భూభాగపు దక్షిణవాలుకూ మధ్య చైనీయులు తమ బలగాలను మూడు శ్రేణులుగా మోహరింపజేసి వున్నారని తెలుస్తున్నది.

లడక్ ప్రాంతంలో సరుకులను రవాణా చేస్తున్న ఒక భారత విమానానికి భూమిమీద నుండి చైనీయులు కాల్పులు జరపగా గుండుదెబ్బలు తగిలాయి; కాని ఆ విమానం తన స్థావరానికి సురక్షితంగానే చేరుకొన్నది.

కూల్చివేయబడిన హెలికాప్టర్ పైలట్ గాలి గుమ్మటంతో బయటకు దూకి తన స్థావరానికి చేరుకొన్నాడు.

చైనా చర్య "నగ్నమైన, భారీ ఎత్తునజరిగే దురాక్రమణ" అనీ, 'పూర్తి

(మిగతా 3 వ పేజీలో)

'చైనా లక్ష్యం పరిమితమైంది'

సరిహద్దు ఘటనలపై అమెరికా అధికార్ల వ్యాఖ్య

వాషింగ్టన్, అక్టోబరు 20

భారతదేశ ఉత్తర సరిహద్దులలో జరుగుతున్న ఘటనలను అమెరికా ప్రభుత్వం చాలా జాగ్రత్తగా పరిశీలిస్తున్నదని అమెరికా అధికారులు నేడు చెప్పారు.

చైనా ముందుకు సాగడంపట్ల అమెరికా ఆందోళనచెందుతున్నదని, అయితే ప్రస్తుతం ఆ ప్రాంతంలో చైనావారి లక్ష్యాలు ప్రస్తుతానికి పరిమితమైనవేనని పాలకవర్గాలు భావించుతున్నాయని అధికార్లు చెప్పారు.

చాల ఎత్తయిన పర్వతశ్రేణుల్లో జరుగుతున్న ఈ సైనిక చర్యలు శీతాకాలం వస్తున్నదీ నుక ఆగిపోతాయన్న అభిప్రాయాన్ని అధికారులు వెలిబుచ్చారు.

శీతాకాలంవచ్చేలోపునే సరిహద్దులలో తమ స్థానాలను పదిలపరచుకోవాలని చైనా భావించి ఉండవచ్చునని అధికారులు వ్యాఖ్యానించారు.

వాషింగ్టన్‌కు అందిన సమాచారాన్నిబట్టి సరిహద్దులలో పెద్దమొత్తున ఘర్షణలు చెలరేగటానికి చైనీయులదే బాధ్యత అని వారన్నారు.

సైనిక పరికరాల సప్లయికి అమెరికా సంసిద్ధత

ఢిల్లీ ప్రభుత్వం కోరినట్లయితే భారతదేశానికి సైనిక పరికరాలు అమ్మడానికి అమెరికా సిద్ధంగా ఉన్నదని అధికార్లు చెప్పారు.

సైనిక పరికరాలు భారతదేశానికి అమ్మే విషయంలో భారతదేశపు కోర్కెను అమెరికా ప్రభుత్వం సానుభూతితో పరిశీలించుతుందని గతంలో విదేశాంగశాఖ ప్రకటించింది.

అయితే అధికారయుతంగా భారతదేశం అలాంటి కోర్కెను వెలిబుచ్చలేదని కూడ అన్నారు.

గోరక్‌పూర్ విద్యార్థి ప్రదర్శనపై కాల్పులు

ఒకరి మృతి, అనేక మందికి గాయాలు, కొందరి పరిస్థితి ప్రమాదకరం

గోరక్‌పూర్, అక్టోబర్ 20

నేటి ఉదయం యిక్కడ యూనివర్సిటీ విద్యార్థుల ప్రదర్శనపై పోలీసులు కాల్పులు, లాఠీఛార్జి జరిపిన ఫలితంగా ఒక వ్యక్తి చనిపోయారు. అనేకమంది గాయపడ్డారు. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి ఆందోళనకరంగా వుంది.

పోలీస్ స్టేషన్ ముందు ఈ దుర్ఘటన జరిగింది. గాయపడ్డవారిలో విద్యార్థులూ, ఇతర్లూ, కొంతమంది పోలీసులు కూడా వున్నారు. నిన్నరాత్రి ఒక కారు డ్రైవర్‌ను ఒక పోలీసు చేయిచేసుకున్నందుకు నిరసనగా విద్యార్థులు ఈవేళ ప్రదర్శన జరిపారు.

ఊరేగింపు యూనివర్సిటీ ఆవరణ నుండి బయల్దేరింది. నగర సమీపంలోకి ఊరేగింపు వస్తుండగా, నగరంలో ప్రవేశించవద్దని అధికారులు ప్రదర్శకులకు చెప్పారట. కాని విద్యార్థులు నగరంలోకి ఊరేగింపుతీశారట. తీరా ఊరేగింపు పోలీసుస్టేషన్ వద్దకువచ్చేసరికి ప్రదర్శకులలోఒకరు పోలీసులపైకి రాయి విసిరారని అధికారుల కథనం. అక్కడ గుమిగూడిన జనంతో సహా స్టేషన్ పైకి తోసుకువెళ్తున్నారని అప్పుడు పోలీసులు బాష్పవాయువు ప్రయోగించినా లాభంలేక కాల్పులకు దిగారని అధికారులు చెపుతున్నారు.

నిన్న రాత్రి ఒక కారు డ్రైవరును ఒక పోలీసు చేయిచేసుకున్న ఫలితంగా పోలీసులకు, అక్కడి జనానికి మధ్య ఘర్షణ చెలరేగింది.

నెహ్రూ చైనా పాలసీకి ఆచార్య రంగా నిరసన

ఆగ్రా, అక్టోబరు 21

చైనా పట్ల నెహ్రూ ప్రభుత్వం "తప్పు విధానం" అనుసరించుతున్నదని స్వతంత్రపార్టీ నాయకుడు ఆచార్య రంగా నేడిక్కడ విమర్శించారు.

చైనా సమస్యపై నెహ్రూ వైఖరి ఒక పద్ధతిలోలేదని, అస్థిరంగా వుంటున్నదనీ, దృఢంగా లేదని ఆయ నన్నారు.

భారతదేశ సరిహద్దు సమస్యలు పరిష్కారం కావాలంటే మన రక్షణ, విదేశాంగ మంత్రిత్వశాఖలు పూర్తిగా మారిపోవాలని శ్రీ రంగా అన్నారు.

స్వతంత్రపార్టీ ప్రాంతీయ సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ ఉత్తర ప్రదేశ్‌లో విధించబడిన అదనపుభూమి శిస్తు పన్నును తీవ్రంగా విమర్శించారు. ప్రజల ఆమోదం లేకుండా పన్నును విధించారనీ, ఈ పన్నును ఉపసంహరించుకొనేంతవరకూ తమపార్టీ పోరాడి తీరుతుందని ఆయన చెప్పారు.

విజయవాడలో కలరా పరిస్థితి

విజయవాడ, అక్టోబరు 21

ఈ వేళ మధ్యాహ్నం పన్నెండు గంటలకల్లా కొత్తగా కలరా తగిలిన వారిని ముగ్గురిని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారని మునిసిపల్ ఆరోగ్యశాఖాధికారి తెలిపారు. నిన్న అర్ధరాత్రిలోగా తొమ్మిదిమందిని ఆసుపత్రిలో చేర్చారు.

కలరావల్ల నిన్న ఒకరు చనిపోయారు. ఈ వేళ మధ్యాహ్నం పన్నెండు గంటలవరకూ అటువంటివి జరగలేదు.

ఇంతవరకు విజయవాడలో మొత్తం 206 మందికి కలరా తగిలింది; 43 మంది చనిపోయారు.

కలరావ్యాధివ్యాప్తి, ప్రజల ఆరోగ్య రక్షణకు అధికారులు అమలు జరిపిన నిషేధాలను ఉల్లంఘించి పాలూ, కాఫీ మొదలైన తదితర పానీయాలనూ, మాంసం, చేపలనూ అమ్మినందుకు ఇంతవరకు పద్దెనిమిది మందిపై కేసులు పెట్టామని, మునిసిపల్ ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ యస్. యల్. సాగర్ తెలిపారు.

నగరంలో చెత్తాచెదారం తొలగించి తగులబెట్టేందుకోసం ఇంకా ఎక్కువ మంది పనివారినీ, బళ్ళనూ నియోగించామన్నారు.

కలరానిరోధక సూదిమందులను ఇంకా ఎక్కువగా ఇవ్వడానికి స్థానిక వైద్యులు ముందుకువచ్చారని ఆయన తెలిపారు. వారికి కలరామందు మొదలయినసామగ్రినిసప్లయి చేశామన్నారు.

సరిహద్దు తగాదాపై ఐరాస చర్చ జరిపే అవకాశం

లేకపోలేదని ఆసియా, ఆఫ్రికా దేశాల పరిశీలకుల భావం

భారత-చైనా సరిహద్దు తగాదా సమస్యను ఐరాస భద్రతాసంఘం ముందుకుగాని, సర్వసభ్య సమావేశం ముందుకుగాని ఎవరో ఒకరు తీసుకొచ్చే అవకాశంలేకపోలేదని ఆసియా, ఆఫ్రికాదేశాల పరిశీలకులు నేడన్నారు.

ఐరాసలో చైనా సభ్యత్వసమస్యపై జరుగనున్న చర్చను భారత-చైనా సరిహద్దు ఘర్షణలు ముసుగున పరచవచ్చునని, అయితే ఆ తగాదాను ఐరాస ముందుకు తెచ్చే ప్రతిపాదన ఇంతవరకు ఎక్కడా కనిపించలేదని మరికొందరు అన్నారు.

కొమింటాంగ్ ముఠాను బర్తరఫ్ చేసి ఆ స్థానంలో నిజమైన చైనా ప్రతినిధుల నేకూర్చోబెట్టాలన్న సోవియట్ ప్రతిపాదనపైన వచ్చే సోమవారం చర్చ జరుగుతుంది.

గత సంవత్సరంకంటె ఎక్కువ మెజారిటీతో చైనా సభ్యత్వ ప్రతిపాదన వీగిపోతుందన్న విశ్వాసం అమెరికా కున్నదని అమెరికా ప్రతినిధి ఒక రన్నారు. గత సంవత్సరం తీర్మానానికి అనుకూలంగా 36, ప్రతికూలంగా 48 ఓట్లు వచ్చాయి. 20 మంది సభ్యులు ఓటింగులో పాల్గొనలేదు.

భారత-చైనా ఘర్షణల వార్తలు ఐరాస కార్యదర్శి యూథాంట్ చెవికి అందజేయడమయింది. అయితే ఈ ఘటనలపై ఐరాస సెక్రటేరియట్ ఎలాంటి వ్యాఖ్య చేయలేదు.

ఐరాస ప్రణాళికలోని 99 వ ఆర్టికల్ ప్రకారం "అంతర్జాతీయ శాంతి, భద్రతలకు ప్రమాదమేర్పడే పరిస్థితి ఏదైనా ఏర్పడిందని తాను భావించితే ఐరాస కార్యదర్శి అలాంటి సమస్యను భద్రతాసంఘం దృష్టికి తీసుకరావచ్చును."

ఈ అంశాన్ని ఈ సందర్భంలో యూథాంట్ వినియోగించుకొనే సూచనలేమీ లేవని అభిజ్ఞవర్గాలు తెలియజేస్తున్నాయి.

రెండు సభ్యదేశాల మధ్య ఏదైనా

(మిగతా 2 వ పేజీలో)

"సంప్రతింపులకు చైనా ఒప్పుకొనేవరకు పోరాడతాం"

ఢిల్లీ బహిరంగసభలో భారత రక్షణమంత్రి శ్రీ మీనన్ ప్రసంగం

న్యూఢిల్లీ, అక్టోబరు 20

భౌగోళిక సమగ్రత కోసం భారతదేశం పోరాడుతుందని రక్షణమంత్రి శ్రీ కృష్ణమీనన్ నేడిక్కడ ప్రకటించారు. "మన దైవదానిని కాయశక్తులా రక్షించుకుంటాం" అన్నారు.

నేడిక్కడ జరిగిన ఒక పెద్ద బహిరంగసభలో శ్రీ మీనన్ మాట్లాడుతూ, తూర్పు, పడమర రంగాలలో చైనాతో సాగుతున్న తీవ్రమైన పోరాటం గురించి చెప్పారు. "వారు సంప్రతింపులకు అంగీకరించే వరకూ మనం పోరాడుతూనే వుంటాం...... [illegible] లొంగిపోయే ప్రాతిపదికపై మాత్రం సంప్రతింపులు జరపబోము" అన్నారు.

ఇప్పటి పరిస్థితిని భారతదేశం మీద చైనావారే బలవంతంగా తెచ్చిపెట్టిందని శ్రీ మీనన్ చెప్పారు; ప్రజలు కోపానికి గాని భయానికిగాని గురికావద్దనివిజ్ఞప్తి చేశారు. "బహుశ పెద్ద ప్రమాదం వుంది కాబట్టి" ప్రధాన మంత్రిమీద చిన్న చిన్న అంతరంగిక విషయాలతో భారం మోపరాదన్నారు.

"తీవ్రపోరాటం కొనసాగుతోంది. మన కేంద్రాలు కొన్ని పడిపోయాయి మనం పోరాడుతూనే ఉన్నాము భారత - చైనాల భవిష్యత్తు, ప్రపంచ శాంతి భవిష్యత్తు, సోషలిజం, ప్రజాస్వామ్యాల భవిష్యత్తు, భారత చైనా ప్రజల మధ్య సుహృద్భావంపై ఆధారపడి ఉన్నాయని ప్రపంచ ప్రజాభిప్రాయం. చైనా ఇంగితజ్ఞానం గ్రహించేంత వరకు మన భూభాగాన్ని కాపాడుకొనడానికి మనం పోరాడుతూనే ఉంటాము.

పశ్చిమాన, ఈశాన్య సరిహద్దు ప్రాంతాలలో నేడు పెద్ద ఎత్తున పోరాటం సాగుతూంది ఉభయపక్షాల నష్టాలు అధికంగా ఉన్నాయి. ఎంతమంది చనిపోయినది, గాయపడినది ఇప్పుడే చెప్పలేము. కాని మన సైనికులు వీరోచిత పోరాటం సాగిస్తూ ఉన్నారు......

'శాంతికోసం' అని చైనావారు అంటున్నట్లుగా 'ప్రగతికోసం' కాని కొంత దేశం పోరాడదు. దీనిని యావన్మంది ప్రపంచానికి చాటి చెప్పదలచాము. సమగ్రతకోసం మనం పోరాడుతున్నాం. యుద్ధం మూలా ప్రపంచం పట్ల మనకుగల బాధ్యతల కారణంగానే మనం పోరాడుతున్నాము.

మేము తాము ప్రవర్తిస్తున్న రీతిలో ప్రవర్తించకుండా ఉండవలసినవారు మనపై తెచ్చిపెట్టిన పోరులో మనం దిగి ఉన్నాము" అని శ్రీ కృష్ణమీనన్ చెప్పారు.

చాలా కొద్ది వ్యవధిలో ఏర్పాటైన ఈ బహిరంగ సభకు చాలామంది ప్రజలు వచ్చారు. శ్రీ మీనన్ ప్రసంగాన్ని శ్రద్ధాళువులై విన్నారు. దేశం పోరాటానికి కృతనిశ్చయమై ఉన్నదని ఆయన అన్న సందర్భాలలో వారు హర్షధ్వానాలు చేశారు.

సమావేశానికి అధ్యక్షత వహించిన ఢిల్లీ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ బ్రిజ్ మోహన్ ఇలా అన్నారు: "దేశ స్వాతంత్ర్యం, సమగ్రతలను కాపాడడానికి తమ ప్రాణాలను అర్పించే సంసిద్ధతతో ప్రజలు ఉన్నారు. భారత దేశపు మంచితనాన్ని సదుద్దేశాలను బహుశా చైనావారు బలహీనతగా పొరపడి ఉంటారు. ముద్దుకు గాంధీజీలకేకాదు శివాజీ, అక్బర్, నేతాజీ బోసులను కూడా కన్న దేశం మనది. మన స్వాతంత్ర్యాన్ని, ఆత్మ గౌరవాన్ని కాపాడడానికి చేయవలసినదంతా చేయడానికి మనం సిద్ధంగా ఉన్నాం."

శ్రీ కృష్ణమీనన్ తన ప్రసంగాన్ని కొనసాగించుచూ ఈ నెల 10 వ తేదీన చైనావారు నేఫాలోని మన సరిహద్దులోకి రావాలని నిర్ణయించుకొన్నారని తెలిపారు.

"మీరూ - విదేశీ పత్రికలవారు కూడా ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలని నేను కోరుతున్నాను. అదేమంటే, ఈ ప్రపంచం మొత్తంమీద మన ప్రాంతం కానిచోట ఎక్కడా ఒక్క భారతీయ సైనికుడు గాని, ఒక్క తుపాకి గాని, ఒక్క విమానంగాని లేదు. మన సరిహద్దులుదాటి అవతలికి వెళ్ళలేదు. [illegible]

(మిగతా 3వ పేజీలో)

బడ్జెట్ కేటాయింపులేకుండా గుంటూరు జిల్లాపరిషత్తులో స్కీముల మంజూరు

కాంగ్రెసు, కమ్యూనిస్టు సభ్యుల విమర్శ

గుంటూరు, అక్టోబరు 20

బడ్జెటులో కేటాయింపు లేకుండా, రాష్ట్రప్రభుత్వం వద్దన్నా వినకుండా, రు 6 లక్షల ఖర్చుగల పనులను అధికారులు చేపట్టడంపై జిల్లా పరిషత్తు సమావేశంలో కమ్యూనిస్టు, కాంగ్రెసు సభ్యులు విమర్శించడంతో గందరగోళం వ్యాపించింది.

కమ్యూనిస్టు సభ్యులు, స్వతంత్ర పార్టీవారు వేసే ప్రశ్నలకు తట్టుకోవడం ఆక్టింగ్ ఛైర్మన్ శ్రీ షేక్ గాలిబ్‌కు కష్టమైంది. శాసనమండలి సభ్యులుగాను, పంచాయితీ సమితుల అధ్యక్షులుగాను ఎన్నికై పరిషత్తు సభ్యులైనవారు ప్రారంభంలో ప్రమాణ స్వీకారం చేశారు.

ప్రశ్నోత్తరాల సమయంలో కమ్యూనిస్టు సభ్యులు శ్రీ కొల్లా వెంకయ్య బడ్జెట్‌లో కేటాయింపు లేకుండా 'వర్క్ ఆర్డర్'ను ఎందుకిచ్చారని ప్రశ్నించడంతో సభలో కలకలం బయలుదేరింది.

నిధులు లేకుండా వర్క్ ఆర్డరు ఇవ్వడం బాధ్యతారాహిత్యమని, ఇటీవల జరిగిన ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఈ పనులను ఇచ్చారని భావించవచ్చునని ఆయన అన్నారు. ఆ తరువాత అధికారుల [illegible] కాంగ్రెసు సభ్యులుకూడా మాట్లాడారు. జిల్లా పరిషత్తు కార్యదర్శి చర్చలో జోక్యంకల్పించుకొంటూ వర్క్ ఆర్డర్లు ఇచ్చినాము కనుక డబ్బు చెల్లించవలసిందేనని అన్నారు. జనరల్ నిధుల నుండి చెల్లించడమెట్లు, లేని [illegible] ఆయన అన్నారు. ప్రభుత్వం కాంట్రాక్టును ఆమోదిస్తేకాని బిల్లులు చెల్లించలేవని బడ్జెటులో నిధులు లేవని ఆయన అన్నారు.

డబ్బులేకుండా పనులు మంజూరు చేయడం బాధ్యతారాహిత్యమని శ్రీ వెంకయ్య అన్నారు.

ప్రభుత్వ ఆమోదం తరువాత లభిస్తుందనే భావంతో పనులు ప్రారంభమయినాయని ఈమని పంచాయతీ సమితి అధ్యక్షుడు శ్రీ పి. శ్రీరాములు అన్నారు.

బాపట్ల పంచాయతీ అధ్యక్షులు మాట్లాడుతూ జిల్లాపరిషత్తు కార్యాలయంలోను, ఇంజనీరింగు శాఖలోను కొంత గందరగోళం వున్నట్లు తోస్తుందని అన్నారు.

ఇంకా ఇలా అన్నారు:

"ప్రాథమిక విద్యాపద్దు క్రింద, బడ్జెట్ కేటాయింపు లేనిదే పనులను మంజూరు చేయకూడదని ప్రభుత్వం 1961 అక్టోబరులో ఉత్తర్వు జారీ చేసింది. ఆ ఉత్తర్వును వెంటనే ఇంజనీరింగుశాఖకు అందజేశామని జిల్లా పరిషత్తు కార్యదర్శి అంటున్నారు. అయితే తమకి ఉత్తర్వు జూలై 21 న అందజేసినట్లు ఇంజనీరింగు అధికారులంటున్నారు.

ప్రభుత్వ ఆమోదం తరువాత పొందవచ్చునని చెప్పి ఇంజనీరింగుశాఖ ఆరు, ఏడు లక్షల వ్యయమయ్యే పనులకు కాంట్రాక్టు కిచ్చింది. కాబట్టి తెరవెనుక భాగోతం ఏదో జరుగుతూవుందని నా అనుమానం."

జిల్లా పరిషత్తు కార్యదర్శి జోక్యం చేసుకొని ఇలా అన్నారు:

"పనులను మంజూరు చేస్తూ ఉత్తర్వు జారీ అయింది కాబట్టి డబ్బు చెల్లించక తప్పదు. కాబట్టి జనరల్ ఫండ్ నుండి డబ్బు చెల్లించవలసిందే. ప్రభుత్వం ఆమోదించేవరకు పరిషత్తు డబ్బు చెల్లించలేదు."

పరిషత్తు ఇంజనీయరు మాట్లాడుతూ వీటిని పరిషత్తు జూలైలో మంజూరు చేసిందనీ, అయినప్పటికీ ఇవేవీ కొత్త పనులు కావని అన్నారు. కొన్ని పనులను అక్టోబరులో కూడ ప్రారంభించడం జరిగిందన్నారు.

ఉపాధ్యాయుల బదిలీలపై తీవ్ర చర్చలు

తరువాత ఉపాధ్యాయుల బదిలీలపై కూడ తీవ్రచర్చలు జరిగాయి. ఈ బదిలీలవల్ల చాలా గందరగోళం ఏర్పడుతున్నదనీ, ఎవరో ఒకరి సిఫార్సుపైననో ఒత్తిడిపైననో ఈ బదిలీలు జరుగుతున్నాయని చాలామందిసభ్యులు విమర్శించారు.

ఉపాధ్యాయుల బదిలీల సమస్యను చర్చించి తగు విధమైన చర్యలు తీసుకొనేందుకు ఒక సలహా సంఘాన్ని నియమించాలని సూచించారు.

శ్రీ గాలిబ్ మాట్లాడుతూ బదిలీలన్నీ పరిపాలనా సంబంధమైన కారణాలవల్లనే జరుగుతున్నాయని సమర్థించారు. ఎన్నికల సందర్భంలో ఈ బదిలీలు జరగలేదన్నారు.

మంచి నీటి సరఫరా, పారిశుద్ధ్యం పద్దుల క్రింద పనులు మంజూరు చేయడంలో అన్ని బ్లాకులపట్ల సమదృష్టి ప్రదర్శించకుండా పక్షపాతంతో వ్యవహరించడం జరుగుతున్నదని సభ్యులు విమర్శించారు.

మద్యనిషేధ చట్టం అమలు

మద్యనిషేధచట్టం అమలు జరుగుతున్న తీరుపై పలువురు సభ్యులు విమర్శించారు.

తగినంత డబ్బు లేనందువల్ల తమ సిబ్బంది ఇప్పుడున్న ఎక్సైజ్ ఏమీ చేయజాలరని జిల్లా ప్రొహిబిషన్ ఆఫీసరు శ్రీ సుబ్బారావు అన్నారు.

తానొక ప్రొహిబిషన్ ఇన్‌స్పెక్టరుపై ఫిర్యాదు చేశాననీ దానిపై జిల్లా ప్రొహిబిషన్ ఆఫీసరు ఎట్టి చర్య తీసుకోలేదనీ శ్రీ మగ్గం అన్నారు.

[illegible] సభ్యులు అబద్ధకోరు, అలా చేయరాదని శ్రీ సుబ్బారావు అన్నారు.

దీనిపై శ్రీ మగ్గంకు (బాపట్ల పంచాయతీసమితి) జిల్లా ప్రొహిబిషన్ ఆఫీసరుకు మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగింది.

శ్రీ పి. శ్రీరాములు తేని ఆఫీసర్లు ఎన్నో ఆఫీసరులూ సభ్యులనీ, ఎన్నికయిన సభ్యులపట్ల మర్యాదగా ప్రవర్తించాలని అన్నారు. ఆఫీసర్లు "దొరతనం" చెలాయించడం మాని పెద్దమనుష్యుల్లా ప్రవర్తించడం నేర్చుకోవాలన్నారు.

ఘర్షణలో తమవారు చాలమంది నష్టపడ్డారని చైనా:

భారతదేశానికి నిరసన పత్రం

పెకింగ్, అక్టోబరు 21

సరిహద్దులోని చైనా ప్రాంతాలపై భారత సైనికులు పెద్ద ఎత్తున దాడి జరిపారని ఇక్కడి భారత రాయబార కార్యాలయానికి చైనా నేడొక నిరసన పత్రాన్ని అందజేసింది.

ఈ పత్రాన్ని చైనా విదేశాంగ ఉపమంత్రి కెంగ్ పియావో అందజేశారని కూడ నవచైనా వార్తాసంస్థ తెలిపింది.

నేఫా, లడక్ - రెండు రంగాలలోనూ చైనా సరిహద్దు గార్డులపై భారత సైనికులు పెద్దయెత్తున దాడి జరిపారని పత్రంలో ఉన్నది.

చైనా గార్డులు చాలమంది చనిపోయారని, గాయపడ్డారని పత్రం చెప్పింది.

వెనక్కు తగ్గడానికి వీలైనంత తగ్గి, ఇంకెంతమాత్రం వెనక్కు పోవడానికి వీల్లేని పరిస్థితుల్లో ఆత్మ సంరక్షణార్థమై చైనీయులు ఎదురుదెబ్బ తీయవలసి వచ్చిందని పత్రంలో చైనా తెలియపరచింది. పోరు ఇంకా కొనసాగుతున్నదని పత్రం చెప్పింది.

భారతదేశం సాగించిన ఈ దాడులు చాలకాలంనుండీ ప్లాను చేసినట్టి వేనని అందులో ఉంది.

ఇందుమూలంగా ఉత్పన్నమయ్యే పరిణామాలన్నిటికీ బాధ్యత వహించటానికి భారతదేశం సిద్ధంగా ఉండాలని ఆ పత్రం పేర్కొన్నది.

భారత - చైనా సరిహద్దు సమస్యపై చైనా ప్రభుత్వం ఎల్లప్పుడూ శాంతియుత పరిష్కారాన్నే కోరుతున్నది. సంప్రతింపులకు భారత ప్రభుత్వం పూర్తిగా నిరాకరించి, చైనా ప్రాంతంలోని చైనా సరిహద్దు సైనికులపై పెద్ద ఎత్తున్న దాడులను ప్రారంభించగా ఇంక గత్యంతరం లేక చైనావారిని గట్టిగా ప్రతిఘటించవలసిన అవసరం ఏర్పడింది.

పోరాటం యింకా కొనసాగుతూనే వుంది. దీనివలన జరుగుతున్న తీవ్ర పరిణామాలన్నిటికీ భారత ప్రభుత్వమే పూర్తి బాధ్యతను వహించవలసి వుంటుంది.

ఉత్తర కాటంగాలో తిరిగియుద్ధం

ఎలిజబెత్‌విల్లి, అక్టోబరు 20

ఉత్తర కాటంగాలో కాంగో కేంద్ర ప్రభుత్వ సేనలకూ మోయిస్ షోంబే సైనికులకూ మధ్య తిరిగి యుద్ధం ప్రారంభమయిందని నేడిక్కడ అధికార ప్రకటన వెలువడింది. ఈ ఉభయ పక్షాలమధ్య మొన్న మంగళవారం నాడు ఒక యుద్ధవిరమణ ఒప్పందం కుదిరింది. అది ఇంతలోనే భగ్నమయింది.

గల్లంతు అయినఒక ఐరాస వైమానికుని కోసం వెదకడంలో సహాయం చేస్తున్న తమ సైనికోద్యోగుల నిద్దరిని కాంగో కేంద్ర ప్రభుత్వ సైనికులు చంపారని, షోంబే ముఖ్య విదేశాంగ మంత్రి ఒక ప్రకటనలో తెలిపారు.

ముతక బియ్యం కనీస ధరలు

త్వరలో ప్రభుత్వ నిర్ణయం

మద్రాసు, అక్టోబరు 20

ముతక బియ్యానికి కనీస ధరలు నిర్ణయించే విషయం కేంద్రప్రభుత్వం పరిశీలిస్తున్నదని కేంద్ర వ్యవసాయమంత్రి డా. రాంసుభాగ్ సింగ్ నేడన్నారు.

ఈ విషయమై త్వరలో నిర్ణయం తీసుకోంటామని మంత్రి అన్నారు.

ఢిల్లీనుండి నేడిక్కడికి వస్తూనే పత్రికా విలేఖరులతో మాట్లాడుతూ డా. రాంసుభాగ్‌సింగ్ ఇలా అన్నారు:

"ఈ సమస్యకు సంబంధించిన వారితో చర్చలు జరుపుతున్నాము. ఇందుకవసరమైన సమాచారం సేకరిస్తున్నాము.

ముతక బియ్యం కనీసధర మణుగు 1 కి 14 లేక 15 రూపాయలుండాలని మా అభిప్రాయం.

"గోధుమ కనీసధర మణుగు 1 కి 13 రూపాయలని ఇదివరకే ప్రభుత్వం నిర్ణయించింది.

నిజం

(సాంఘిక నాటకం)

రచయిత:

శ్రీ రాచకొండ విశ్వనాథశాస్త్రి

"ఈ సంఘంలో పేదవాడికి న్యాయం దొరకదు కాక దొరకదు. అసలన్యాయం జరిగితే ఎవర్నొకరికి పేదవాడి కీ సంఘంలో అవకాశం లేదు కాక లేదు ఈ పరిస్థితి పోవాలనే నాకుంది అందుకే యీ నాటకం రాసేను." — రచయిత

వెల రు. 2-0-0 ప్రతులకు: పోస్టేజి రు. 0 20

విశాలాంధ్ర ప్రచురణాలయం, విజయవాడ-4

విశాలాంధ్ర సేల్స్‌డిపో, బీసెంటురోడ్, విజయవాడ-2

పీపుల్సుబుక్‌హౌస్, నెహ్రూరోడ్, హైదరాబాద్.

శ్రీ కృష్ణమీనన్ ప్రసంగం

(1వ పేజీ తరువాయి)

మనకు లేదు. మనకు కావలసినంత దేశం వుంది. దానితోనే మనం ఆనందంగా వున్నాం."

చైనావారు గత నెలలోనో ఎప్పుడో భారతీయ ప్రాంతంలోకి "తగినంత బలగంతోనూ, విధ్వంసక శక్తితో"నూ వచ్చారని శ్రీ మీనన్ తెలిపారు. కాని ఈ శాంతియుతమైన దేశం ఎన్నడూ తన పొరుగుదేశంపై యుద్ధం చేయాలనే భావాన్ని కలిగి వుండలేదు. అలాంటప్పుడు వారిని మన మీదకు వస్తుంటే రానీయడమేనా?

వెనక్కి తగ్గినా మనవారు తెల్లజెండామాత్రం చూపలేదు

ఆ ప్రాంతంలో చైనావారికి చాలా సైనిక దళాలున్నాయి. అయినా వారిని ఎదుర్కొనడానికి మనం ప్రయత్నిస్తాం. ఈ రోజున-అక్టోబరు 20 న మన సైనిక దళాలు ధైర్య సాహసాలతో పోరాడుతున్నాయి. వారు కొన్ని స్థానాలను వదలిపెట్టి వచ్చారు. కాని ఏ ఒక్క సైనికుడు, ఏ ఒక్క ఆఫీసరు లొంగుబాటు సూచనగా తెల్లజెండా మట్టుకు చూపలేదు.

"మనం పోరాడి తీరుతాం. వారు సంప్రతింపులకు అంగీకరించేంతవరకూ మనం పోరాడుతూనే వుంటాం." అని శ్రీ మీనన్ అన్నారు.

గతంలో చైనా పట్ల భారత్ చూపెట్టిన సుహృద్భావాన్ని, సానుభూతిని శ్రీ మీనన్ జ్ఞప్తికి తెచ్చి ఇలా అన్నారు:

"వారితో మంచిసంబంధాలను వుంచుకోడానికి ప్రయత్నించాం. ఐక్యరాజ్య సమితిలో చైనా సమస్య వచ్చినప్పుడు చాల మందికి యిష్టంలేక పోయినప్పటికీ వారి న్యాయమైన ప్రభుత్వానికి ఐరాసలో ప్రాతినిధ్యం వుండాలన్న ప్రతిపాదనను బలపరచాం. చైనా సైనికులు వాలంటీర్లుగా పోరాడుతున్న కొరియాలో యుద్ధాన్ని ఆపివేయడానికి భారత్ తోడ్పడింది. జపానుతో శాంతిసంధిపై సంతకాలను పెట్టినప్పుడు చైనానే భారత్ బలపరచింది. టిబెట్ పై చైనా సార్వభౌమాధికారాన్ని గుర్తించాలని, దానితో వాణిజ్య ఒడంబడిక చేసుకొన్నది. అప్పుడే ప్రపంచ ప్రఖ్యాతి పొందిన పంచశీల సూత్రాలు రూపొందాయి. అలాంటి చైనా యిప్పుడు మన ప్రాంతంపై దురాక్రమణ దాడి జరిపి మన సైనికులను చంపివేస్తున్నది.

భారత్ - చైనాలు ఒకదాని పట్ల మరొకటి వ్యవహరించిన తీరునుగురించి శ్రీ మీనన్ పోల్చి చెబుతూ భారత్ చైనాపట్ల ఒక నాగరిక దేశం మరొక నాగరిక దేశంపట్ల వ్యవహరించవలసినతీరులో ప్రవర్తించినదని తెలిపారు.

చైనా ప్రధాని చౌ ఎన్-లై భారత దేశానికి వచ్చినప్పుడు ఉభయదేశాల మధ్య చెప్పుకోదగిన పెద్ద తగాదాలేమీలేవని చెప్పారు. తప్పుగావున్న కొన్ని చైనాపటాలను చైనా ప్రధాని దృష్టికి తీసుకొనిరాగా ఆపటాలు చాల కాలం క్రిందట ప్రచురించబడినవన్నారు.

బర్మాతోనూ, నేపాల్ తోనూ సరిహద్దు ఒడంబడికలను చేసుకొన్న సందర్భంలో చైనా "కొండవాగు జాలు" సూత్రాన్ని అంగీకరించింది. కాని మన విషయంలో మాత్రం వేరుగా చూసి ఈ క్లిష్ట పరిస్థితిని తెచ్చిపెట్టింది.

నైతికంగాగాని, న్యాయశాస్త్ర రీత్యాగాని, సైనికంగాగాని చైనా పట్ల ఈ దేశం చెడుగా వ్యవహరించి వుండలేదు. ఇదేదో మేము మంచిగా వున్నామని రుజువుచేసుకునేందుకు నేను చెప్పడంలేదు. ఒక దేశం ఎంత మంచిగా వ్యవహరించినప్పటికి ఆ విషయం ప్రపంచప్రజలు గుర్తించేటట్లు చేయాలి. మా అభిప్రాయమేదో స్పష్టంగానే వుంది. ఈ దేశానికి మరొకరి ప్రాంతం ఏమాత్రం అవసరం లేదు. మాకు శక్తి వున్నంతవరకూ మనదైనదానిని సంరక్షించుకొంటాం.

భారత్ శాంతియుతమైన దేశం. అది ప్రపంచశాంతిని వాంఛిస్తున్నది. తన పంచవర్ష ప్రణాళికలు ఫలించి, జాతీయ సౌభాగ్యాన్ని పెంపొందించుకోవాలని కోరుకొంటున్నది.

చైనాయే సూత్రాలను ప్రారంభించింది. కాని అదే నేడు సంగనాచిలాగా 'భారత - చైనా మైత్రి' అంటూ మాట్లాడుతోంది. స్నేహంగా వుండాలని మేము కోరుతాం. అయితే యజమాని, బానిస పద్ధతి 'కాదు'. ఇప్పటికే ఇంగ్లండువంటి చాలా కాలంగా వలసలు ఆక్రమణ క్రింద వున్న అనుభవముంది. మళ్ళీ అలాంటి పరిస్థితిని అంగీకరించము.

పాక్ దురాక్రమణ

శ్రీ కృష్ణమీనన్ దురాక్రమణను గురించి మాట్లాడుతూ పాకిస్తాన్ కాశ్మీరును ఆక్రమించుకోవడాన్ని గురించికూడా మాట్లాడారు. పాకిస్తాన్ తో వున్న యీ యుద్ధవిరమణ రేఖ మూలంగా అక్కడనుండి మన సైన్యాలనన్నింటినీ తరలించడానికి వీలులేక పోయిందన్నారు.

పాకిస్తాన్-చైనాల దురాక్రమణను గురించి శ్రీ మీనన్ కలిపే మాట్లాడారు. తన దృష్టిలో వారుద్దరూ దురాక్రమణదారులేనన్నారు. కాని చైనాది ఇంకా ఎక్కువ తప్పు, చైనా ఆ భూభాగం మనదని తెలిసి కూడా చొచ్చుకొనివచ్చింది. ఆ పరిస్థితులను అంతర్జాతీయ న్యాయశాస్త్రాన్ని, చరిత్ర, సంప్రదాయం ధ్రువీకరించాయని ఆయన వివరించారు.

శ్రీ మీనన్ మరల లడక్ లో సాగుతున్న పోరును గురించి ప్రస్తావించి ఈ వేళ ఉదయం చైనావారు ఒక భారతీయ రవాణా విమానంపై దాడి చేశారు, కాని అది తన స్వస్థానానికి క్షేమంగా చేరుకోగలిగిందని తెలియజేశారు.

అవి ఫైటర్ విమానాలు కావన్నారు.

"రెండు రోజుల క్రితం చైనా "పీపుల్సు డైలీ" పత్రిక మన ప్రధాన మంత్రిని సామ్రాజ్యవాదనీ, విస్తరణ వాదనీ, అభివృద్ధి నిరోధకుల ప్రతినిధి అనీ నిందిస్తూ భూమిమీదవున్న మన సైన్యాలను మన ఫైటర్ విమానాలు రక్షణగా వుంటున్నాయని ఉద్దేశపూర్వకంగా అబద్ధాలు వ్రాసింది. సివిల్, మిలిటరి రవాణా విమానాలు ఏవీ చైనా ఆకాశభాగంలో ఎగిరివుండలేదని నేను స్పష్టంగా చెప్పదలచాను."

ఈ వేళ ఉదయం అయిదు గంటల నుండి నేను యిక్కడ మాట్లాడుతున్నప్పటివరకూ దురాక్రమణ యుద్ధం కొనసాగుతూనేవుంది, మనకంటేవారు ఎక్కువ మంది వున్నందువల్ల కొంత ప్రాంతాన్ని వదలి రావలసివచ్చింది. అయినా మనం పోరాడుతూనే వుంటాం. అయితే యితరుల ప్రాంతాన్ని ఆక్రమించుకోవడానికి కాదు, మనదైన దానిని కాపాడుకోవడానికే.

మనకున్న ఇబ్బందులు

యుద్ధంకోసం భారతదేశం ప్రయత్నాలు చేసుకోలేదనీ, భారత సైనికులు ఎంతో ఎత్తు నుండి పోరాడవలసి వస్తున్నదనీ, విమానాల నుండేవారికి సరఫరాలు అందజేయవలసి వస్తున్నదనీ శ్రీ మీనన్ చెప్పారు. చైనావారివిషయంలో అలా కాకుండా టిబెట్ భూభాగంనుండి సరఫరాలు అందుతాయన్నారు.

మనకు శక్తి వున్నంతవరకూ వారిని ప్రతిఘటిస్తామనీ, లొంగుబాటు ప్రాతిపదికపై రాయబారాలకు అంగీకరించేది లేదనీ శ్రీ మీనన్ చెప్పారు. వారితో సూటిగా సంప్రతింపులకుగాని, మరొకరిద్వారాగాని మనం ఎల్లప్పుడూ సిద్ధమే. అయితే అందుకు న్యాయసమ్మతమైన ఒక ప్రాతిపదిక వుండాలి. వారు మన దేశంలోకి చొచ్చుకొనివచ్చి, మనం మాక్ మాహన్ రేఖను దాటివెళ్ళామని ప్రపంచానికి చెబుతూవుంటే సంప్రతింపులకు ఇంక ఎక్కడ అవకాశం వుండగలదని ఆయనన్నారు.

వెలుపలనుండి గొప్ప ప్రమాదం సంభవించినందున ప్రధాన మంత్రికి చిన్న చిన్న విషయాల్లో ఎక్కువభారం వేయరాదని శ్రీ మీనన్ కోరారు.

సంఘ వ్యతిరేకశక్తులకు ప్రజలు లొంగిపోయి ధరలను పెంచడానికి అవకాశం ఇవ్వరాదని విజ్ఞప్తి చేశారు. ప్రజలు తమ రాజకీయ, ప్రాంతీయ వైషమ్యాలను విస్మరించాలని కోరారు.

గత పది రోజుల్లోనూ మన జాతీయ పత్రికలు మొత్తంమీద నిగ్రహంగానే వ్యవహరించాయని శ్రీ మీనన్ అభినందించారు.

హిందూ, ముస్లిం, ధనిక, పేద, విద్యావంతుడు, నిరక్షరాస్యుడు, ఈ రాజకీయపార్టీ, ఆ రాజకీయ గ్రూపు-యిలా ఏమాత్రం విభేదాలు లేకుండా అంతా ఒకే జాతిగా నిలబడాలని ఆయన ఉద్బోధించారు.

భారతదేశంతో సత్సంబంధాలకై ఇండొనీషియా కృషి

డాక్టరు సుబాండ్రియో వివరణ

జకార్తా, అక్టోబరు 21

భారతదేశంతో సత్సంబంధాలను పునఃస్థాపించుకోవాలని ఇండొనీషియా విదేశాంగమంత్రి డాక్టరు సుబాండ్రియో గతరాత్రి అన్నారు.

ఆసియా ఆటల పోటీలు జరుగుతున్న సందర్భంలో భారత ప్రతినిధి సోంధీ ఆక్రమ వైఖరికి నిరసనగా జకార్తాలో భారత వ్యతిరేక ప్రదర్శనలు జరిగిన సంగతి పాఠకులకు విదితమే.

ఢిల్లీలోని ఇండొనీషియా రాయబారితో నిన్న సుబాండ్రియో మాట్లాడారు.

భారత-ఇండొనీషియా సంబంధాలను మెరుగుపరచడానికై తీసుకొనవలసిన చర్యలను గురించి తాము చర్చించామని ఆ తర్వాత సుబాండ్రియో చెప్పారు.

సత్సంబంధాలను ఉభయ దేశాలు కోరుకొంటున్నాయని పత్రికా విలేకరులతో ఆ రాయబారి అన్నారు.

మామూలు పరిస్థితులు ఏర్పడుతున్నట్లు తాము తెలియపరచామనికూడ చెప్పారు.

అభివృద్ధి ఫలితాలు కొందరికే దక్కాయి

కేంద్ర మంత్రి జగజ్జీవన్ రామ్ విచారం

నాగపూర్, అక్టోబరు 21

దేశంలో జరిగిన అభివృద్ధి ఫలితాలు సమాజంలోని ఒక భాగానికి మాత్రమే దక్కుతున్నాయని, పెరిగిన జాతీయాదాయం కొద్దిమంది వ్యక్తుల చేతుల్లోనే కేంద్రీకృత మౌతున్నదనే అంశాన్ని నిపుణుల కమిటీ ఒకటి పరిశీలన జరుపుతున్నదని కేంద్ర రవాణా కమ్యూనికేషన్ల మంత్రి శ్రీ జగజ్జీవన్ రామ్ నేడిక్కడ అన్నారు.

దేశ స్వాతంత్ర్యమే ప్రధానమనీ, తక్కినవన్నీ దాని తర్వాత నేనని అందువల్ల ఆ స్వాతంత్ర్యాన్ని పరిరక్షించడానికి ప్రతిపౌరుడూ ప్రతినబూనాలని కూడ మంత్రి శ్రీ జగజ్జీవన్ రామ్ అన్నారు.

తంతి, తపాలా ఉద్యోగుల జాతీయ సమాఖ్య ఆరవ మహాసభను ప్రారంభిస్తూ 'భారత దేశానికి చైనా వెన్నుపోటు పొడిచింద'ని శ్రీ జగజ్జీవన్ రామ్ అన్నారు.

'స్వాతంత్ర్యాన్ని ఎవ్వరికి మనం ధారాదత్తం చేయం అనే అంశాన్ని ప్రపంచమంతా గుర్తుంచుకోవాలి' అని ఆయన అన్నారు.

"జాతాభివృద్ధి కార్యక్రమాల నిర్వహణకై కష్టించి పని చేయాలని, త్యాగం చేయాలని ప్రజలను గతంలో కోరడమైంది. ఇప్పుడు దేశస్వాతంత్ర్య రక్షణకై ఆ పని చేయాలి.

ఉత్పత్తి పెంపకానికి కృషి సాగుతోంది. సాంఘిక ఆచారాలు, ఆర్థిక వ్యవస్థ మారిపోవాలి. అభివృద్ధి పనుల వల్ల సంఘంలోని ఒక భాగం మాత్రమే లాభాలు పొందుతున్నది. పెరిగిన జాతీయాదాయం కొద్దిమంది వ్యక్తుల చేతుల్లోనే కేంద్రీకృతమై పోతున్నది అనే అంశాన్ని నిపుణుల కమిటీ ఒకటి పరిశీలిస్తున్నది, అని శ్రీ జగజ్జీవన్ రామ్ చెప్పారు.

తంతి, తపాలా ఉద్యోగుల ఇబ్బందులను ప్రస్తావించి వారి సమస్యలు తక్కిన ప్రజల సమస్యలతో సంబంధం లేనివి కావని మంత్రి చెప్పారు.

దేశంలోని సమస్యలన్నింటి మూలం పేదరికమేనన్నారు.

తంతి, తపాలా ఉద్యోగుల పిల్లల సౌకర్యార్థమై శాస్త్రీయ, సాంకేతిక కళాశాలల విద్యార్థులు 250 మందికి స్కాలర్ షిప్పులు ఇస్తామని మంత్రి ప్రకటించారు.

1960 లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సమ్మెలో పాల్గొన్న ఉద్యోగులపై విధించిన శిక్షలను రద్దు చేయవలసిందిగా ఉద్యోగులు వెలిబుచ్చిన కోర్కెను ప్రస్తావించి గతంలో ప్రభుత్వం చేసిన నిర్ణయానికి తిరుగులేదని, అంతకంటే తాను చెప్ప గలిగిందేమీ లేదని మంత్రి అన్నారు.

ఉద్యోగులపై అక్రమంగా శిక్షలు విధించారని సభకు అధ్యక్షత వహించిన సమాఖ్య అధ్యక్షుడు శ్రీ వి. జి. దాల్వి అన్నారు.

మహాసభ అక్టోబరు 24 వ తేదీ వరకు కొనసాగుతుంది.

యోగ్యతనుబట్టి వైద్యకళాశాలల్లో విద్యార్థుల ప్రవేశం

కేంద్ర ఆరోగ్యసమితితీర్మానం

బొంబాయి, అక్టోబరు 20

వైద్య కళాశాలల్లో విద్యార్థులను చేర్చుకోవడంలో షెడ్యూల్డు కులాలు, తెగల వారికి మినహా తక్కిన వారి విషయంలో వారి యోగ్యతను దృష్టిలో పెట్టుకోవాలని నిన్న మహాబలేశ్వరంలో ముగిసిన కేంద్ర ఆరోగ్య సమితి సమావేశం భావించిందని అక్కడి నుండి తిరిగివచ్చిన బీహార్ ఆరోగ్య మంత్రి పండిత హరినాథమిశ్రా నేడు చెప్పారు.

కల్తీమందులు తయారుచేసేవారికి, అమ్మేవారికి ఇతరులకు కూడ బుద్ధి వచ్చేవిధంగా శిక్షలువిధించాలని సమితి తీర్మానించిందనిపండితమిశ్రా చెప్పారు. మందుల కంట్రోలు చట్టాన్ని ఆ విధంగా సవరించాలనికూడ సమితి తీర్మానించిందని ఆయన అన్నారు.

ఆయుర్వేద విద్యను మామూలు మెడికల్ కోర్సులో కలిపివేయరాదని శుద్ధ ఆయుర్వేదంలో శిక్షణ ఇవ్వాలని అందుకనుగుణంగానే సిలబస్ ను రూపొందించాలనిసమితితీర్మానించింది. అయితే ప్రస్తుత పద్ధతి ప్రకారం నేర్చుకొన్న విద్యార్థుల చదువులో జోక్యం కలిగించుకోరాదని సమావేశం భావించింది. కొత్తవిద్యార్థులకు మాత్రం శుద్ధ ఆయుర్వేదకోర్సునే బోధించాలని సమితి తీర్మానించింది.

పాకిస్తాన్ పై మన కెప్పుడూ ద్వేషమేనట

అయూబ్ ఆరోపణ

రావల్పిండి, అక్టోబరు 21

పాకిస్తాన్ పైన భారతదేశానికి ఎప్పుడూ ద్వేషభావమే వుంటూవచ్చిందనీ, అయితే పాకిస్తాన్ మాత్రం భారత దేశంతో స్నేహంతో మెలగాలని ప్రయత్నించిందని పాకిస్తాన్ అధ్యక్షుడు అయూబ్ ఖాన్ అన్నారు.

బ్రిటిష్ పార్లమెంటరీ ప్రతినిధి వర్గంతో ప్రసంగిస్తూ ఉభయదేశాలకు మధ్య సంబంధాలు బెడిసివుండటానికి కారణం భారతదేశ విధానాలే అని ఆరోపించారు.

చైనాలో శాస్త్రాభివృద్ధి

బ్రిటిష్ ప్రతినిధివర్గ అభిప్రాయాలు

లండన్, అక్టోబరు 21

శాస్త్ర సంబంధమైన విషయాలలో చైనా ప్రజారిపబ్లిక్ పశ్చిమ రాజ్యాలతో సమాచారాన్ని యిచ్చిపుచ్చుకోవాలని వాంఛిస్తోందని ముఖ్యంగా బ్రిటన్ తో ఈసంబంధాలనువిస్తరించుకోగోరుతోందని ఇటీవల 10 రోజులు చైనాలో పర్యటించి వచ్చిన బ్రిటిష్ శాస్త్రజ్ఞుల ప్రతినిధివర్గం ఇక్కడ తెలియజేసింది. ఈ ప్రతినిధివర్గంలో అయిదుగురు సభ్యులున్నారు.

బ్రిటిష్ రాయల్ సొసైటి ఉపాధ్యక్షుడు గార్డన్ సూథర్ లాండ్ పత్రికా గోష్ఠిలో మాట్లాడుతూ, చైనావారు సైన్సు విషయాలలో భౌతిక విజ్ఞాన శాస్త్ర విషయాలపై (ఫిజిక్స్) ఎక్కువగా కేంద్రీకరించిపరిశోధనలు జరుపుతున్నారని ముఖ్యంగా "ఎలక్ట్రానిక్స్"లో వారు గణనీయమైన కృషి చేస్తున్నారని అన్నారు.

సర్ గార్డన్ సూథర్ లాండ్ తమ పర్యటనానుభవాలను యింకా యిలా వివరించారు:

"చైనావారు తమ పరిశోధనల్లో ప్రస్తుతం బ్రిటన్ కన్నా యింకా కొద్దిగా వెనుకబడివున్న మాట నిజమే. కాని మరో 10 సంవత్సరాలలో చైనానుండే మనం (బ్రిటన్) నేర్చుకోవలసి వచ్చినా ఆశ్చర్యపడాల్సిన పని లేదు. అణుభౌతిక శాస్త్రపరిశోధనలు శాంతియుత కార్యకలాపాలకా లేక రక్షణ విషయాలకా అన్న విషయమై మేము చర్చలు జరపలేదుగాని, ఈ రంగంలోకూడ వారు కేంద్రీకరించి పనిచేస్తున్నారు."

'కరువు కాటకాల వార్తలు అబద్ధం'

ప్రతినిధివర్గంలోని ఒక సభ్యుడు మాట్లాడుతూ, తమ పర్యటన ప్రధానంగా శాస్త్ర విజ్ఞాన రంగంలో చైనా అభివృద్ధిని పరిశీలించడానికే ఉద్దేశించబడ్డప్పటికీ, తాము సందర్శించిన నగరాలలోని ప్రజల భౌతిక జీవన పరిస్థితులను పరిశీలించకుండ వుండలేకపోయామన్నారు.

ఈ సందర్భంలో గార్డన్ సూథర్ లాండ్ మాట్లాడుతూ, "చైనా ప్రజలు కరువు కాటకాలతో మాడుతున్నారన్న అభిప్రాయం సరైనదేనని నమ్మడానికి మేము చూసినంత లెక్క సాక్ష్యాధారాలు లభించలేదు." అని అన్నారు. గార్డన్ అభిప్రాయంలో ప్రతినిధివర్గ సభ్యులందరూ ఏకీభవించారు.

పెకింగ్, షాంఘై, కాంటన్ విద్యార్థులనుండి, ఇటు గ్రామీణప్రాంతాల్లోని ప్రజా కమ్యూన్లలోని రైతాంగ ప్రజల వరకు అంతా కష్టించి పనిచేస్తున్నారని, లక్ష్యాలను ఆచరణలో పెడుతున్నారని ప్రతినిధివర్గం ప్రశంసించింది.

ఐరాస చర్చ జరిపే అవకాశం

(1 వ పేజీ తరువాయి)

తగాదాలు వచ్చినప్పుడు, ఆ దేశాలు ఒకదాన్నొకటి గుర్తించకుండావున్న పక్షంలో ఐరాస ప్రధానకార్యాలయం ఒక మధ్యవర్తి కేంద్రంగా పని చేస్తూ ఉండేది. కాని ఐరాస లో చైనా సభ్యదేశం కాదు గనుక భారత-చైనా సరిహద్దు తగాదా విషయంలో ఐరాస ప్రధానకార్యాలయం ఈ కర్తవ్యాన్ని నెరవేర్చజాలదన్న అనుమానం ఇక్కడ వ్యక్తమైంది.

తగాదా పరిష్కారానికై సోవియట్ యూనియన్ కృషి చేస్తుందా అన్న ప్రశ్నకు గత వారం సోవియట్ విదేశాంగ మంత్రి గ్రోమికో సూటిగా సమాధాన మివ్వలేదట. ఎంత త్వరగా సమస్య పరిష్కారమైతే అంత మంచిదని మాత్రమే ఆయన అన్నారని 'రాయిటర్' విలేకరి కథనం.

సోమవారంనాడు చైనా సభ్యత్వానికై ప్రసంగించవలసిన సోవియట్ విదేశాంగశాఖ ఉపమంత్రి జోరిన్ కు చైనా శాంతికాముక దేశమని ఎక్కువ మందికి నచ్చజెప్పడం కష్టమై పోతుందని పశ్చిమ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి.

గతసారి అమెరికాతో భేదించి సోవియట్ తీర్మానానికి అనుకూలంగా ఓటుచేసిన బ్రిటన్ వైఖరిలో ఈసారి మార్పులేదు. చైనా ప్రజారిపబ్లిక్ ని అంతర్జాతీయ జీవనంలో ఒక వాస్తవంగా ఐరాస గుర్తించాలనేదే బ్రిటిష్ ప్రభుత్వవైఖరి అని బ్రిటిష్ వర్గాలు పునరుద్ఘాటించాయి.

చైనాకుసభ్యత్వమివ్వాలని గతంలో ముఖ్యపాత్ర నిర్వహించిన భారతదేశం ఈసారి ఏమీ చెప్పకపోవచ్చు ననుకొంటున్నారు.

పెకింగ్, న్యూఢిల్లీలనుండి వస్తున్న వార్తలను ఆసియా, ఆఫ్రికాదేశాల ప్రతినిధులు జాగ్రత్తగా పరిశీలిస్తున్నారు. ఐరాస భద్రతాసంఘం ముందుకో, లేక సర్వప్రతినిధి సభ ఎదుటకో ఈ తగాదాను తీసుకవచ్చే అవకాశం లేకపోలేదని పరిశీలకు లంటున్నారు.

అయితే మధ్యవర్తులుగా వ్యవహరించ దలచుకొన్నవారెవరైనా పెకింగ్ న్యూఢిల్లీలలోని రాయబార కార్యాలయాలద్వారా ప్రస్తుతం ఆ కృషిచేస్తే మెరుగని పరిశీలకులు సూచించారు.

అమ్మోనియం నైట్రేట్ ధరల తగ్గింపు

కేంద్ర వ్యవసాయ మంత్రి రాంసుభాగ సింగ్

మద్రాసు, అక్టోబరు 20

కాల్షియం అమ్మోనియం నైట్రేట్ ఎరువుల ధరలు టన్ను 273 రూపాయలనుండి 246 రూపాయలకు తగ్గించామని కేంద్ర వ్యవసాయమంత్రి డా. రాంసుభాగ సింగ్ నేడిక్కడ చెప్పారు.

ఢిల్లీనుండి నేడిక్కడికి వచ్చిన డా. రాంసుభాగ సింగ్ విలేకరులతో మాట్లాడుతూ ఇంకా ఇలా అన్నారు:

"ఎరువులధరల తగ్గింపుకు ప్రభుత్వం తీసుకొన్న ఈ నిర్ణయాన్ని నేడు రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేశాము. ప్రస్తుతం ఎరువుల వ్యాపారమంతా సహకార సంఘాలే నిర్వహిస్తున్నవి కాబట్టి తగ్గింపు ధరల మూలంగా అవి తమ వ్యాపారం ఎక్కువ చేసుకోవచ్చు.

ప్రజలకు యూరియా ఎరువులు కావాలంటే అవికూడ సరఫరా చేయగలం.

తృప్తికరంగా వున్న పంటల పరిస్థితి

దేశంలో పంటల పరిస్థితి సంతృప్తికరంగా వుందని మంత్రి అన్నారు. ఎరువుల ధరలు తగ్గించడంమూలంగా పంజాబు మొదలగుచోట్ల రైతులు ఇతోధికంగా ఎరువులు వాడుతున్నారని అన్నారు.

ఇంగ్లీషు ఉపాధ్యాయులను తర్ఫీదు చేసేందుకు మూడో, నాలుగో శిక్షణ సంస్థలను స్థాపించాలని కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ ఆలోచిస్తున్నది.

కార్మికులకు గృహవసతిసౌకర్యం

పారిశ్రామిక యజమానులపై లెవీ విధించే సూచన

న్యూఢిల్లీ, అక్టోబరు 19

పారిశ్రామిక కార్మికులకోసం నిర్మించే గృహనిర్మాణ పథకాలకోసం పారిశ్రామిక యజమానులపై లెవీని విధించే అవకాశాలను గురించి కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తోంది.

ఇక్కడ జరుగుతున్న గృహశాఖా మంత్రుల సమావేశం ఈ సమస్యను గురించి నేడు చర్చించింది. యజమానులు స్వంతంగా గాని, ప్రభుత్వ తోడ్పాటుతోగాని నిర్మించిన ఇండ్ల లెక్కలను సేకరించాలని ఆ సమావేశంలో సూచన వచ్చింది. దీనిని బట్టి ఇండ్లకొరత ఎంతవరకు వున్నదో తెలియగలదని అనుకొంటున్నారు.

వ్యవసాయ సరకుల ధరల స్థిరీకరణ

అవసరమని భారత్ కృషిక్ సమాజ్ తీర్మానం

చండీఘర్, అక్టోబరు 21

వ్యవసాయసరకులు ముఖ్యంగా ఆహారధాన్యాల, వ్యాపార పంటల ధరలను స్థిరీకరించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను, ప్రణాళికాసంఘాన్ని కోరుతూ భారత్ కృషిక్ సమాజ్ కౌన్సిల్ తీర్మానించింది.

మూడు రోజులుగా జరుగుతున్న కౌన్సిల్ సమావేశం నేడు ముగిసింది.

ధరలు స్థిరీకరించడంలో వినిమయదారుల ఉత్పత్తిదారుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకోవాలని కౌన్సిల్ కోరింది.

చక్కెర దిగుబడినిబట్టి చెరకుధరను లెక్కగట్టాలని ప్రభుత్వం ఇటీవల చేసిన నిర్ణయాన్ని విమర్శిస్తూ కౌన్సిల్ మరొక తీర్మానం చేసింది. టన్ను కింతధర చెల్లించాలనే పాత సూత్రాన్నే అమలు జరపాలని డిమాండు చేసింది.

వీడ్కోలుసభ

తుమ్మలపల్లి, అక్టోబరు 19

తూర్పుగోదావరిజిల్లా ప్రాథమికోపాధ్యాయ సంఘ కార్యదర్శి, తుమ్మలపల్లి సెకండరీ పరిషత్ స్కూలు ఉపాధ్యాయుడు అయిన శ్రీ యం. నరసింహస్వామి గారు బదిలీ అయిన సందర్భంలో ఆ గ్రామపెద్దలు వీడ్కోలు సభను ఏర్పాటుచేసి వారిని సన్మానించారు.

సభలు - సమావేశాలు

దక్షిణ నెల్లూరుజిల్లా కమ్యూనిస్టు సమితి కార్యవర్గ సమావేశం ఈ నెల 24 వ తేదీ ఉదయం 9 గంటలకు నెల్లూరుజిల్లా పార్టీ ఆఫీసులో జరుగుతుంది.

దక్షిణ నెల్లూరుజిల్లా కమ్యూనిస్టు సమితి విస్తృత సమావేశం ఈ నెల 25వ తేదీ రాత్రి 9 గంటలకు నెల్లూరు జిల్లా పార్టీ ఆఫీసులో జరుగుతుంది.

ఈ సమావేశానికి శ్రీ వై. వి. కృష్ణారావు, శ్రీ జి. యల్లమందారెడ్డి(ఎం పి.) గార్లు హాజరవుతారు.

'బంజర్ల పంపిణీకి ప్రత్యేక సిబ్బందిని రద్దుచేయరాదు'

ప్రదేశ్ వెనుకబడ్డ తరగతుల సమాఖ్య కార్యవర్గం విజ్ఞప్తి

హైదరాబాద్, అక్టోబరు 21

బంజరు భూములను హరిజనులకు, భూములులేని పేదవారికి పంచేందుకని పాత సంజీవయ్య మంత్రివర్గం ఏర్పరచిన ప్రత్యేక సిబ్బందిని ప్రస్తుత ప్రభుత్వంరద్దుచేసేందుకు ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సమాఖ్య కార్యవర్గం విచారం వెలిబుచ్చింది. కార్యవర్గం ఈ నెల 18వ తేదీన అధ్యక్షుడు శ్రీ కావ్యసూర్య అధ్యక్షతన సమావేశమైన సందర్భంలో పైవిధంగా విచారం ప్రకటించింది.

తిరిగి ప్రత్యేక సిబ్బందిని ఏర్పర్చవలసిందిగా కోరుతూ కార్యవర్గం ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ఈలోగా ప్రభుత్వంభూముల పంపిణీకి పూనుకోరాదని కోరింది.

కార్యవర్గం మరో తీర్మానాన్ని ఆమోదిస్తూ, సాంఘిక సంక్షేమ కార్యకలాపాలను రాజకీయాలతో నిండివున్న జిల్లా పరిషత్తులకు, సమితులకు ప్రభుత్వం అప్పగించే విధానాన్ని వ్యతిరేకించింది. ఈ కార్యకలాపాలను ఇంతకుముందు మాదిరిగానే సాంఘిక సంక్షేమశాఖ డైరెక్టరుకు అప్పగించాలని తీర్మానంలో కోరింది.

కార్యవర్గం మరో తీర్మానం చేస్తూ, అన్ని హైస్కూళ్ళలోనూ, కళాశాలల్లోనూ షెడ్యూల్డు తరగతుల, షెడ్యూల్డు కులాల విద్యార్థులకు ప్రత్యేకంగా శిక్షణ యిచ్చేందుకు ట్యూటర్లను నియమించాలని, శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ నిర్ణయించినందుకు హర్షాన్ని వెలిబుచ్చారు.

ఉద్యోగాల్లోనూ, కళాశాలల్లోనూ షెడ్యూల్డు తరగతులవారి స్థానాలను 15 నుండి 12 శాతానికి తగ్గించాలని వచ్చిన జి. వో ను కార్యవర్గం విమర్శించింది. వెనుకబడిన తరగతుల, షెడ్యూల్డు కులాల విద్యార్థులకు స్కాలర్ షిప్పుల ద్వారా సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం తగినన్ని నిధులను కేటాయించి వుంచాలని కోరింది.

సిక్కు మతాధిపతి రాజీనామా

అమృతసర్, అక్టోబరు 20

సిక్కు మతాధిపతిగావున్న జతేదార్ అచ్ఛార్ సింగ్, స్వర్ణదేవాలయ పురోహితుడు గ్యానీ భూపేంద్రసింగ్ లు నేడు శిరోమణి ప్రబంధక్ కమిటీ అధ్యక్షుడు సంత్ చనన్ సింగ్ కు తమ రాజీనామా పత్రాలు పంపారు.

విజయవాడ కమ్యూనిస్టుపార్టీ భవననిధికి రు. 20 వేలు వసూలు

రు 20 వేలకు పిలుపివ్వగా, రు 32 వేలు వాగ్దానం

విజయవాడ, అక్టోబరు 20

విజయవాడ పట్టణ కమ్యూనిస్టుపార్టీ, భవననిధికి రు 20 వేలు కావాలని పిలుపు యివ్వగా 20 రోజులలో రు 32,810 లు వాగ్దానాలు వచ్చాయి. రు 20,460 లు వసూలైంది.

కొనబోయే భవనం పాతదికావడం వల్ల ఆ భవనాన్ని పూర్తిగా తొలగించి నూతన భవనాన్ని ఆధునిక పద్ధతులపై నిర్మించాలనీ, అందుకు అన్ని రకాలపని వారు, మేస్త్రీలతోసహా ఉచితంగా పనిచేసి, నిర్మించడానికి సిద్ధంగావున్నామని కార్యాలయంలో వాగ్దానంచేసి, నిధి వసూళ్ళకింకో పదివేలు అదనంగా వెయ్యాలని కోరారు. భవనం ఖరీదు, రిజిస్ట్రేషను వగైరా ఖర్చులు కలసి ఇరవై వేల రూపాయలవుతుందని, సామగ్రి కొనుబడికి ఇంకో పది వేలు వసూలు చేస్తే, మంచివిలువైన ఆధునిక కార్యాలయాన్ని నిర్మించగలమని భవన నిర్మాణ కార్మికులు ప్రోత్సహించారు.

వారి ప్రోత్సాహంతో, పాత పట్టణానికి చెందిన పార్టీ సభ్యుల, అభిమానులనుండి వాగ్దానాలు తీసుకున్నారు. వాగ్దానాలు ముప్పైవేల రూపాయలు దాటించి దిగువ యిచ్చిన వివరాల ప్రకారం ఇప్పటికి 20,460 రూపాయలు వసూలైనవి. ఈ అక్టోబరు 22వ తేదీన రిజిస్టరు జరుగబోతున్నది.

స్వల్ప వ్యవధిలో అతి సామాన్యులైన పార్టీసభ్యులు, అభిమానులు అపార త్యాగదృష్టి ప్రదర్శించి యింత పెద్ద మొత్తాన్ని సేకరించి, ఇచ్చినందుకు వారికి పట్టణసమితి తరపున శ్రీ తమ్మిన పోతరాజు (ఎం ఎల్. ఏ) గారు అభినందనలు అందజేస్తున్నా.

వాగ్దానాలు చేసిన మిత్రులు తక్కిన సుమారు పదివేలరూపాయలు త్వరలో వాగ్దాన కార్యాలయంలో జమ చేసి రశీదులు పొందాలని కోరారు. ఎంత త్వరలో ఆ మొత్తం వసూలైతే అంత త్వరగా నూతన భవన నిర్మాణం ప్రారంభించ బడుతుందని తెలియజేశారు.

కొత్తపట్టణం ప్రాంతానికి గూడా ఒక భవనాన్ని కొనాలని సంకల్పించామని, తమ దృష్టికి వచ్చిన కొన్ని భవనాలు పరిశీలిస్తున్నామని చెప్పారు. త్వరలో పార్టీకి రెండవ కార్యాలయం గూడ స్వంత భవనంలో ఏర్పడేందుకు కొత్తపట్టణ ప్రాంత సభ్యులు, అభిమానులు సహాయపడగలరనే ఆశాభావం వెలిబుచ్చారు.

విరాళాల వివరాలు

భవననిధికి వాగ్దానాలు, (వసూళ్ళు) వివరాలు: శ్రీయుతులు రాయిన గురువులు 1116 (1116), సుఖమంచి రంగారావు 516 (516), పైల రాములు 516 (516), గానుగుల రాములు 516 (516), కాయితాల కృష్ణమూర్తి 516 (516), ఆర్. రాంబాబు 516 (516), ఎస్. రాములు 516 (516),కంటే వెంకటరత్నం 150 (150), తెన్నేరు సూర్యనారాయణ 516 (516), పి హ లక్ష్మణరావు 200 (200),బోను అప్పారావు 516 (500), పామర్తి ఆదిశేషులు 516 (516), పువ్వాల బ్రదర్స్ 516 (516), అంగా అప్పారావు 516 (516),ఒక అభిమాని 1116 (1116),గాంపిల్లి ఆంజనేయులు సోదరులు 516 (516),చింతా వెంకటరత్నం 516 (516), రావి వెంకటరత్నం 516 (516), పిల్లి రామిరెడ్డి అండ్ సన్స్ 258 (258),అంబటి సముద్రాలు 516(516) వడాల దాలప్ప 258(258), తటవర్తి వెంకటేశ్వర్లు 516 (500), నాగోతి రామమూర్తి 516 (516),మామిడి రంగారావు సోదరులు 516 (516) సిరిగిరెడ్డి రాములు 516 (516), ఉప్పల పోతిరాజు 516(116), పెనుమాక సుబ్రహ్మణ్యం గారి కుమారుడు శ్రీ వెంకటసుబ్బారావు 516 (516),ఒక అభిమాని 516 (250 ,మహంకాళి సూర్యనారాయణ 516 (516), డి నాగేశ్వరరావు 516 (516),నాగోతి రామారావు 258 (200), తమ్మిన పోతిరాజు-రాములు 516 (258 ,బోను కృష్ణ 516 (500), బొమ్మనా బాబూ 116 (116),ఒక అభిమాని 116 (116), మధ్యాల కృష్ణమూర్తి 116 (116),వి. ప్రేమవతి సుబ్బారావు 116 (116), కె. నరసింహా 116, (116) ఎఱ్ఱిపెద్దల నారాయణ 116 (116) బబు, మల్లికార్జునరావు 116 (116), సింగవల్లి సత్యం 116 (116), ముత్తా రామకృష్ణ 116 (116) రావి చిన్నారెడ్డిగారి భార్య లక్ష్మమ్మ 116 (116), తుమ్మలపల్లి అమ్మిరాజు 116 (116), రాజగిరి గురువులు 116 (116), పోతిన సుబ్బరామయ్య 116 (116), జి. వెంకటయ్య 116 (116). తమ్మిన అప్పన్న 116 (116), కనకదుర్గా విలాస్ 116 (116), కెలిపర్ల విశ్వనాథం 116 (116), వేల్పు వెంకటేశ్వరరావు 116 (116 , రాజగిరి నరసింహారావు 116 (116), ముదిలి చిన్నారావు 116 (116), ఈదులాడ వెంకటేశ్వరరావు 116 (116), పైల అప్పలస్వామి 116 (116), మండూరి మల్లికార్జునరావు 116 (116), అలాసపూరి మల్లయ్య 116 (116), బొమ్మిన గురువులు 116 (116), గరే సత్యనారాయణ 116 (100), పితా రాములు 116 (116), మేకల పుల్లయ్య 116 (116), పోతిన సింహాచలం 116 (116), చెలిల సత్యనారాయణ 116 (116), పంగా యల కోటయ్య 116 (116), బి. రాములు 116 (116), పెరుమాళ్ళ రామకృష్ణారావు 116 (116), షేక్ హుస్సేన్ 116 (116), ఉప్పలపాటి రాఘవరాజు దంపతులు 800 (500), రాయన కొండలు 116 (90), కనికచర్ల నారాయణరావు 516 (100 , కొరికాని అప్పారావు-శ్రీరాములు 516 (200), బొనుపల్లి పోలన్న 258 (100,.

ప్యారీ కంపెనీ యూనియన్ వార్షికోత్సవం

తాడేపల్లి, అక్టోబరు 15

తాడేపల్లి ప్యారీ కంపెనీ స్టాఫ్ అండ్ లేబరు యూనియన్ ప్రథమ వార్షిక మహాసభ ఈ నెల 14 వ తేదీ శ్రీ బి. యల్. యన్. శాస్త్రి అధ్యక్షతను జరిగింది. యూనియన్ కార్యకలాపాలనుగూర్చి కార్యదర్శి శ్రీ రాఘవరావు నివేదిక ఇచ్చారు.

ఈ క్రింది వారిలో నూతన కార్యవర్గం ఎన్నుకొన్నారు. అధ్యక్షులు: శ్రీ వేములపల్లి శ్రీకృష్ణ ఎం ఎల్. ఏ) ఉపాధ్యక్షులు: శ్రీ పి వి. బాలకృష్ణ, శ్రీ బి. హనుమంతరావు (ప్రధాన కార్యదర్శి: శ్రీ బి. యల్. యన్. శాస్త్రి; సహాయ కార్యదర్శులు: శ్రీ కె వేంకటేశ్వరరావు; శ్రీ కె. చిన్నయ్య; కోశాధికారి: శ్రీ పి.బసవయ్య. వివిధ డిపార్టుమెంటుల నుండి 11 మంది కమిటీ సభ్యులను ఎన్నుకొన్నారు.

శ్రీ రఘునాథరావుగారి వందన సమర్పణతో మహాసభ ముగిసింది.

సంగీతం అవసరం

మనస్సును ఉత్తేజపరచగలదని శ్రీ రాధాకృష్ణ

న్యూఢిల్లీ, అక్టోబరు 20

సంగీతం శరీరానికి, మనస్సుకు, ఆత్మకు ఉత్తేజాన్ని కలిగిస్తుందని రాష్ట్రపతి డాక్టర్ రాధాకృష్ణ నేడిక్కడన్నారు.

సాంస్కృతిక, ఆధ్యాత్మిక సౌభాగ్యంలేని ఏ నాగరికత మనజాలదని ఆయనన్నారు.

అఖిలభారత రేడియో తొమ్మిదవ సంగీత సమ్మేళనపు ప్రారంభోత్సవం జరుపుతూ డాక్టర్ రాధాకృష్ణ ప్రసంగించారు.

మన ప్రాచీన సంగీతాన్ని, సంగీతంలోని ఉన్నత ప్రమాణాలను బాగా ప్రచారం చేస్తున్నందుకు ఆయన ఆలిండియా రేడియోను అభినందించారు.

హిందూస్తానీ, కర్నాటక సంగీతాల్లో జరిగిన పోటీల్లో గెలుపొందిన 23 మందికి రాష్ట్రపతిబహుమతులను ప్రదానం చేశారు.

సాంప్రదాయక హిందూస్తానీ సంగీతంలో కలకత్తాకు చెందిన కుమారి మణిమంజూష, కర్నాటక సంగీతంలో ఢిల్లీకి చెందిన శ్రీమతి జె. ఆనంద ప్రథమబహుమతులను పొందారు.

తాడిపత్రి డాకరు లంచంకేసు విచారణ

తాడిపత్రి, అక్టోబరు 20

అనంతపురంజిల్లా తాడిపత్రి తాలూకా టూరమేయిల గ్రామంలో సుబ్బాడి నల్లప్పతో, అతని భార్య సుబ్బమ్మకు సుస్తీ బాగుచేయుటానికని రు 40 లు లంచంతీసుకొన్నట్లు చేసిన ఆరోపణలను సెప్టెంబరు 16న అనంతపురం డి. ఎం. ఓ. విచారణ చేశారు. కాని యింతవరకు యుక్తచర్య తీసుకొన్నట్లు లేదు. (వి వి.)

విద్య నేర్పకుండా ఎగవేసే పద్ధతి

ప్రస్తుతవిద్యావిధానంపై ఉపరాష్ట్రపతి ప్రసంగం

శ్రీనగర్, అక్టోబరు 20

విద్యార్థులకు విద్యనందించకుండా ఎగవేసే విద్యా విధానం నేడు భారత దేశంలో ఉన్నదని ఉప రాష్ట్రపతి డాక్టరు జాకీరు హుస్సేన్ నేడన్నారు.

జమ్మూ-కాశ్మీర్ విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో ప్రసంగిస్తూ, జకీర్ హుస్సేన్ ఇలా అన్నారు.

"విద్య నేర్చుకోవాలనే మనం ప్రారంభించి చివరకు మరోవిధంగా ముగింపుతాము. ఉద్యోగ సంపాదనకు పనికిరాదనుకొను సంస్కృతం, అరబిక్, పర్షియన్, ఉన్నతభాషలను నేర్చుకోవడం మానివేశాము. ఇంగ్లీషు ఎక్కువగా నేర్చుకొంటూ ఉద్యోగానికి, చదువుకు మధ్యగల సంబంధాలను ఇంకా పెంచాము.

ఉద్యోగాలనే అరుదు చేశాము. విద్య నేర్పకుండా మనం తప్పుకొంటున్నామని నేను ఖచ్చితంగా చెప్పగలను. అంతేగాక మంచి ఉద్యోగ వసతులుకూడ తగ్గిస్తున్నాము.

ప్రస్తుతం డిగ్రీలు కోసమకొంటున్నారంటే దానివల్ల వేతనాలు వస్తాయనే ఉద్దేశం మాత్రమే"

హుస్సేన్ సాగర్ కట్టపై చెట్టుకు వ్రేలాడుతున్న శవం

హైదరాబాదు, అక్టోబరు 19

ఈ రోజు సాయంత్రం హుస్సేన్ సాగర్ కట్టపై ప్రక్కనేవున్న చింత చెట్టుకొమ్మకు వ్రేలాడుచున్న ఒక శవం కనిపించింది.

పోలీసులకు ఈ విషయం తెలియగానే వచ్చి శవాన్ని ఉస్మానియా ఆసుపత్రికి పరీక్షార్థం పంపించారు.

ఎవరో ఉరిపోసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడని అనుమానిస్తున్నారు.

పోప్‌తో రాజాజీ గోష్ఠి

రోమ్, అక్టోబరు 19

శ్రీ సి. రాజగోపాలాచారి నేడు పోప్ జాన్‌ను వ్యక్తిగతంగా కలుసుకొన్నారు. పోప్ సాధారణంగా ఎవరితోనయినా సరే 20 నిమిషాలసేపే మాట్లాడుతారు. కాని ఆయన రాజాజీతో ముప్పయి అయిదు నిమిషాలసేపు ప్రపంచ శాంతి సమస్యను గూర్చి ముచ్చటించారు.

రష్యాచే మరొక ఉపగ్రహం ప్రయోగం

మాస్కో, అక్టోబరు 20

సోవియట్ యూనియన్ "కాస్మాస్-11" అనే ఉపగ్రహాన్ని నేడు ప్రయోగించింది. నాలుగు రోజులలో సోవియట్ యూనియన్ ఉపగ్రహాన్ని ప్రయోగించడం ఇది రెండవ సారి. అంతరిక్షపరిశోధనకోసం ఈ ఉపగ్రహాలను వరుసగా ప్రయోగిస్తున్నారు.

రేడియో, టెలిమెట్రిక్ సామగ్రితో ఈ ఉపగ్రహం నిర్ణీతమయిన కక్ష్యలోనికి ప్రవేశించింది. 75-158 మైళ్ళమధ్య ఈ ఉపగ్రహం భూమిని ప్రతి 96 నిమిషాలకు ఒకసారి చుట్టివస్తుంది.

గుడివాడ పంచాయతీ సమితి కో-ఆప్షన్

కాంగ్రెసు-కమ్యూనిస్టువర్గం సభ్యుల ఎన్నిక

గుడివాడ, అక్టోబరు 20

గుడివాడ పంచాయతీ సమితికి కో-ఆప్షన్ చేసుకొనే ఆరుగురు సభ్యుల స్థానాలకు నేడు సమితి కార్యాలయంలో జరిగిన ఎన్నికలో కాంగ్రెసు, కమ్యూనిస్టు పక్షాలు కలిపి ఐక్యంగా నిలబెట్టిన ఆరుగురూ ఎన్నికైనారు.

ఈ ఎన్నికలో స్వతంత్రపార్టీ వారూ, జిల్లా పరిషత్తులో కాంగ్రెసు సభ్యులు శ్రీ కొండపల్లి కృష్ణారెడ్డి వర్గం కలసి పోటీచేశారు. అయినా వారి అభ్యర్థులకు ఒక్క ఓటు కూడా రాలేదు.

ఇప్పుడు కో-ఆప్ట్ అయిన సభ్యుల పేర్లు: శ్రీమతులు కూచిపూడి అమ్మాజీ, కీరపనేని సుశీల, శ్రీయుతులు అమురుమిల్లి వెంకటేశ్వరరావు, గోదం గురునాథం (కమ్యూ), [illegible] దేవదానం (కమ్యూనిస్టుసమర్థకుడు).

ఉమ్మడి మార్కెటు ప్రతిపాదనలను స్ట్రాస్‌బర్గులో సమావేశమైన యూరోపియన్ పార్లమెంట్ సాధారణంగా ఆమోదించింది.

నందివాడ ఫిర్కాలో రైతు సత్యాగ్రహాలు

30 మంది పేర్ల నమోదు

పెటూరు, అక్టోబరు 20

కృష్ణాజిల్లా నందివాడ ఫిర్కా కమ్యూనిస్టుపార్టీ సభ్యులు, సానుభూతిపరుల సమావేశం నేడిక్కడ జరిగింది. అధికశిస్తు చట్టం, బంజర్ల పంపకం సమస్యలను గురించి చర్చించారు. ఈ సమావేశంలో అదనపు శిస్తు చట్టాన్ని ఉపసంహరించాలని కోరే రైతు సత్యాగ్రహంలో పాల్గొనడానికి 30 మంది పేర్లు ఇచ్చారు. ఇంకా ముదినేపల్లి ఫిర్కాలో 15 మంది, తుమ్మలపల్లి, వెన్ననపూడి, తమిరిశ గ్రామాలలో 15 మంది, దొండపాడు, గురజ, పెనుమల్లి గ్రామాల్లో 17 మంది సత్యాగ్రహంలో పాల్గొనడానికి తమ పేర్లను నమోదు చేసుకొన్నారు.

ఆంగ్లభాష బోధించే వారికి శిక్షణ

బెంగుళూరులో కేంద్రం నెలకొల్పాలని నిర్ణయం

న్యూఢిల్లీ, అక్టోబరు 20

ఆంధ్ర, మద్రాసు, మైసూరు, కేరళ రాష్ట్రాలకోసం ఇంగ్లీషులో అధ్యాపకులకు శిక్షణ ఇచ్చేందుకు బెంగుళూరులో ప్రాంతీయ సంస్థను నెలకొల్పాలని ఇక్కడ సమావేశమైన ఆ రాష్ట్రాల విద్యామంత్రులు నేడు తాత్కాలికంగా నిర్ణయించారు.

రోగాలతో పశువుల మృతి

ఇబ్రహీంపట్నం తాలూకాలో

హైదరాబాదు, అక్టోబరు 20

ఇబ్రహీంపట్నం తాలూకా చిన తుండ్ల, రంగాపురం మొదలగు గ్రామాలలో గుండెయుక్క రోగాలతో పశువులు చనిపోతున్నవి. రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

పశువులకు తగుచికిత్సా సౌకర్యాలు కలిగించాలని స్థానికప్రజాసంస్థలుప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాయి.

శ్రీ నెహ్రూతో రష్యా రాయబారి భేటీ

అరగంటసేపు చర్చ

న్యూఢిల్లీ, అక్టోబరు 20

సోవియట్ రాయబారి ఐ. ఎ. బెనెడిక్టోవ్ నేడు ఉదయం ప్రధాని నెహ్రూను కలుసుకొని అరగంటసేపు సంభాషించారు.

చైనా-భారత సరిహద్దులలో ఉత్పన్నమైన తీవ్ర పరిణామాలను గురించి శ్రీ నెహ్రూ ఆయనకు ఎరుక పరచారని భావించబడుతున్నది.

చైనాకు భారత ప్రభుత్వ లేఖ

లోగడ చైనా పంపిన పత్రాలకు సమాధానం

న్యూఢిల్లీ, అక్టోబరు 20

"ధాగ్లాకొండకు దగ్గరగా దక్షిణాన వున్న నాంకా-చూ నదీలోయలోని పచ్చిక బయళ్ళను ఉపయోగించుకొనడానికి టిబెట్‌లోని "లే" గ్రామస్థులకు అనుమతి ఇవ్వబడింది. ఈ నదీలోయ మీదనే భారత రక్షణ దళాలమీద చొరబడివచ్చిన చైనాసైన్యాలు దాడులను ఉధృతం చేస్తున్నాయి" అని చైనా ప్రభుత్వానికి భారత ప్రభుత్వం పంపిన లేఖలో చెప్పారు.

"రుసుం వసూలుచేసి, భారత ప్రభుత్వానికి చెల్లించాలని" 1953 ఆగస్టులో తోనావద్ద వుండే చైనా అధికారి వ్రాతపూర్వకంగా కోరినందున మేత మేపుకొనే రుసుం చెల్లించినమీదట అనుమతి ఇవ్వబడింది"

అలాగే 'లే' గ్రామానికి మేత మేపుకొనే రుసుం చెల్లించే భారత గ్రామాలు ఆకొండకు ఉత్తర దిక్కున తమ పశువులను మేపుకొంటున్న సందర్భాలున్నాయి; కాని యిలా పరస్పరం యిచ్చిపుచ్చుకొనే ధోరణిలో చేసుకొన్న ఏర్పాటు వున్నప్పటికీ, ఆపరిస్థితి "థాగ్లా కొండశిఖరం మీదుగా పోయే అంతర్జాతీయ సరిహద్దును మార్చివేయగా ఇంకా ధృవ పరుస్తుంది కూడ" అని భారత లేఖలో చెప్పారు.

చైనా ప్రభుత్వం అక్టోబరు 10,11, 13 తేదీలలో పంపిన లేఖలకు ఇది భారత ప్రభుత్వం పంపిన సమాధానం. దీనిని అక్టోబరు 16న చైనా రాయబార కార్యాలయానికి అందజేశారు. దీనినీ, చైనా లేఖలనూ నేడు ప్రకటించారు. నేఫాప్రాంతంలో ఉద్రిక్తత, సంఘర్షణలు, చైనాబలాలు కావాలని సాగించిన దురాక్రమణ ఫలితమేనని భారత పత్రంలో తెలిపారు. అందుచేత వీటి పూర్తిబాధ్యత చైనా ప్రభుత్వమే వహించాలని అన్నారు.

చర్చలతో అంతర్జాతీయ సమస్యల పరిష్కృతికి కృషి

ఇతోధికంగాసాగిస్తామని రుమేనియాఅధ్యక్షుడు జార్జ్యు-దేజ్ భారతప్రధాని నెహ్రూల సంయుక్త ప్రకటన

న్యూఢిల్లీ, అక్టోబరు 20

అంతర్జాతీయంగా ఉద్రిక్తత నివారణకోసం, ప్రపంచ శాంతి పరిరక్షణకోసం అన్ని అంతర్జాతీయ వివాదాలను సంప్రదింపులద్వారా పరిష్కరించడానికి తమకృషిని ద్విగుణీకృతం చేస్తామని రుమేనియా అధ్యక్షుడు జార్జి జార్జ్యు-దేజ్, ప్రధాని నెహ్రూ నేడు జారీచేసిన సంయుక్త ప్రకటనలో తమ కృతనిశ్చయాన్ని వెలడించారు.

అన్ని అంతర్జాతీయ సమస్యలను శాంతియుతమైన చర్చల ద్వారా పరిష్కరించడానికి అందుకు సంబంధించిన వారంతా తమ కృషిని ద్విగుణీకృతం చేయాలని, ఓర్పుని, సహనాన్ని ప్రదర్శించుతూనే ఉండాలని నాయకు లిద్దరూ కోరారు.

మానవాళియెదుట నేడున్న కర్తవ్యాలలో ప్రపంచ శాంతి పరిరక్షణ అత్యంత ఆవశ్యకమైనదని వారు అంగీకరించారు. అంతర్జాతీయ అదుపుక్రింద సార్వత్రిక సంపూర్ణ నిరాయుధీకరణ సాధనకు అన్ని రకాల అణుపరీక్షలకైన సంపూర్ణ నిషేధ సాధనకు త్వరగా ఒప్పందాలకు రావడానికై అందుకు సంబంధించిన వారంతా కృషి కొనసాగించాలని వారు ఉద్బోధించారు.

అన్ని రూపాలలోను వలస విధానాన్ని నిర్మూలించవలసిన ఆవశ్యకత ఉన్నదని వారు వక్కాణించారు. ఆదేవిధంగా జాతి విచక్షణ నిర్మూలించాలని ఉన్నదని వారు పేర్కొన్నారు. అభివృద్ధి చెందిన దేశాలకు, అభివృద్ధి చెందుతున్న దేశాలకు మధ్య వున్న అగాధాన్ని [illegible] త్వరగా పూడ్చవలసి ఉన్నదని వారు అన్నారు.

వెనుకబడిన దేశాలకు ఒక్క ఆర్థిక సహాయం చేసేటంతమాత్రాన సరిపోదు. ఆ దేశాలు ఉత్పత్తిచేసే ముడిసరుకులకు సరసమైన ధరలు లభించడం అవసరం. అభివృద్ధి చెందిన దేశాలకు తమ వివిధ వస్తువులను అమ్ముకొనే అవకాశాలు వాటికి ఉండాలి అని వారు అన్నారు.

ఈ సందర్భంలో ఐరాస ఆధ్వర్యంలో అంతర్జాతీయ వర్తక మహాసభ జరగాలనే ప్రతిపాదనకు వారు హర్షామోదాలు తెలిపారు.

ఉభయదేశాలమధ్య సాంస్కృతిక ఆర్థిక సంబంధాల అభివృద్ధికి వారు సంతృప్తి వెల్లడించారు. నూనెశుద్ధి కర్మాగారం నెలకొల్పడంలోనూ, నూనె అన్వేషణలోను ఇచ్చిన అమూల్యమైన సహాయానికి ప్రధాని నెహ్రూ రుమేనియా ప్రభుత్వానికి కృతజ్ఞత వెల్లడించారు.

శ్రీ నెహ్రూకు రుమేనియా ఆహ్వానం

రుమేనియా సందర్శించవలసిందిగా ప్రధాని నెహ్రూను రుమేనియా అధ్యక్షుడు జార్జి జార్జ్యు-దేజ్ ఆహ్వానించారని, శ్రీ నెహ్రూ అందుకు అంగీకరించారని సంయుక్త ప్రకటన వెల్లడించింది.

జాతీయ సమైక్యత, ప్రాంతీయ తత్వం కమిటీ సమావేశం

న్యూఢిల్లీ, అక్టోబరు 20

జాతీయ సమైక్యతా, ప్రాంతీయ తత్వం కమిటీ శ్రీనగర్‌లో నవంబరు 10 నుంచి 13 వరకు సమావేశమై [illegible] ప్రతినిధులను ఇంటర్వ్యూ చేస్తుంది.

ప్రాంతీయ భాషల్లో సాంకేతిక పదాలు

రూపొందించడం పూర్తి అయిందని కేంద్ర విద్యామంత్రి డా॥ శ్రీ మాలి వెల్లడి

న్యూఢిల్లీ, అక్టోబరు 20

అన్ని ప్రాంతీయ భాషల్లోనూ శాస్త్రీయ, సాంకేతిక పదజాలాన్ని గ్రాడ్యుయేట్ కోర్సువరకూ రూపొందించేపని దాదాపు పూర్తి అయిందని నేడిక్కడ కేంద్ర విద్యామంత్రి డాక్టర్ శ్రీమాలి తెలియజేశారు.

శాస్త్రీయ, సాంకేతిక పదాలను రూపొందించే కమిషన్‌కు సంబంధించిన కేంద్ర సలహాసంఘ ద్వితీయ సమావేశంలో డాక్టరు శ్రీమాలి ప్రసంగిస్తూ అన్ని భాషల్లోనూ అఖిల భారత శాస్త్రీయ, సాంకేతిక పదజాలంకూడా తయారై ఇప్పుడు సిద్ధంగా వున్నదని తెలియజేశారు. ఈ సంవత్సరాంతానికి ఆ నిఘంటువు ప్రచురింపబడి శాస్త్రీయ, సాంకేతిక పదజాల కమిషన్ ఆమోద ముద్రను కూడా పొందగలుగుతుందని ఆయన చెప్పారు.

డాక్టర్ డి. యస్. కొఠారి నాయకత్వాన ఈ కమిషన్ ఈ పనిని త్వరత్వరగాపూర్తిచేయగలిగినందుకు వారిని డాక్టర్ శ్రీమాలి అభినందించారు.

భౌతిక శాస్త్రం, రసాయనిక శాస్త్రం, గణితశాస్త్రాలలోని శాస్త్రీయ సాంకేతిక పదాలన్నీ గ్రాడ్యుయేట్ దశవరకు ఇప్పటికే నిర్ణయించబడినాయనీ, ప్రకృతిశాస్త్రాలకు, జీవశాస్త్రాలకుఅవసరమైన పదజాలాన్ని రూపొందించడం పూర్తి అయినప్పటికీ, వీటిని తుదిసారిగా నిర్ణయం చేసేపని యింకా సాగుతున్నదనీ ఆయన తెలిపారు.

ఇంజనీరింగ్, టెక్నాలజీకి సంబంధించినపని కొంతవరకు జరగవలసి వుందనీ, అదికూడా ఈ సంవత్సరాంతానికి పూర్తి చేయబడుతుందనే ఆశాభావాన్ని ఆయన వెలిబుచ్చారు.

అధికార భాషపై రాష్ట్రపతి యిచ్చిన ఆదేశాన్ని అనుసరించి-సాధ్యమైనంతవరకూ అంతర్జాతీయంగా వాడుకలోవున్న సాంకేతిక పదజాలాన్ని స్వీకరించడానికే కమిషన్ ప్రయత్నం చేసిందని విద్యామంత్రి చెప్పారు.

ప్రాంతీయ భాషల్లో శాస్త్రీయ, సాంకేతిక సంబంధమైన పుస్తకాలను తయారు చేయించేందుకు కూడా కమిషన్ యిప్పుడుపూనుకొన్నదన్నారు. అందువలన స్వంతంగా శాస్త్రీయ గ్రంథాలను వ్రాయించడానికి, విదేశ భాషల్లో వున్న శాస్త్రీయ, సాంకేతిక సంబంధమైన గ్రంథాలను అనువాదం చేయించడానికి ఏదో ఒక రకమైన యంత్రాంగాన్ని నెలకొల్పవలసిందిగా రాష్ట్ర ప్రభుత్వాలకు, యూనివర్శిటీలకు కమిషన్ సూచించింది. ఇందుకోసం కేంద్రప్రభుత్వ నూటికి నూరుపాళ్లు ఆర్థిక సహాయం చేయడానికి సంసిద్ధంగా వున్నదనీ, ప్రాంతీయభాషలను అభివృద్ధి చేసుకోవాలనే దీక్ష నిజంగావున్నపక్షంలో ఈ కార్యక్రమం ఇప్పుడు పెద్దఎత్తున సాగడానికి అవకాశం వుందనీ ఆయన అన్నారు.

వీరవల్లి బ్లాకులో కలరావల్ల 12 మంది మరణం

సత్వర సహాయానికి సమితి అధ్యక్షుని విజ్ఞప్తి

హనుమాన్ జంక్షన్, అక్టోబరు 20

వీరవల్లి, పెరికీడు, తేలప్రోలు, సీతారామపురం, బొలుకుమూడు గ్రామాల్లో కలరావల్ల 12 మంది చనిపోయారు. ఇంకా 25 మందికి ఈ వ్యాధి సోకినట్లు తెలుస్తోంది. సమితి అధ్యక్షులు శ్రీ అట్లూరి వెంకటకృష్ణ రామబ్రహ్మంగారు ఈ పై గ్రామాలలో పర్యటించారు. ఇప్పటికి వ్యాధి నిరోధక మందులుగాని, తగు సిబ్బందిగాని లేవని, వెంటనే సిబ్బందిని, అవసరమైన మందులను సప్లయి చేయాలని జిల్లా ఆరోగ్యశాఖాధికారిని కోరారు. సమితినిధినుంచి రు. 250 లు మంజూరు చేశారు. కనీసం వెయ్యిరూపాయలైనా మంజూరు చేయవలసిందిగాను, సమితిలోని 43 గ్రామాల్లోకి కనీసం 4 గురు ప్రత్యేక ఆరోగ్యశాఖ ఇన్‌స్పెక్టర్లు కావలసి వుంటుందనీ వెంటనే తగు సిబ్బందితో, మందులతో వారిని ఆయా ప్రాంతాలకు పంపవలసిందిగాను రామబ్రహ్మంగారు జిల్లా ఆరోగ్యశాఖాధికారిని కోరారు.

వ్యాధి నిరోధక చర్యలు తీసుకోవలసిందిగా అన్ని పంచాయతీ బోర్డుల అధ్యక్షులకు శ్రీ రామబ్రహ్మంగారు విజ్ఞప్తి చేశారు. (వి. వి)

ఉమ్మడి మార్కెట్ అధికారులకు బ్రిటిష్ అధికారులకు [illegible] జరిగిన చర్చలు విఫలమయ్యాయి.

• • •

పశ్చిమ జర్మనీలోని ఆచెన్ నగరం రాయిటర్ వార్తాసంస్థ 112వ వార్షికోత్సవం జరిపింది.

భారత-సోవియట్ దేశాల మధ్య నౌకాయానం

హెచ్చగలదని సోవియట్ ప్రతినిధి వెల్లడి

కలకత్తా, అక్టోబరు 20

రాబోయే సంవత్సరాల్లో భారత-సోవియట్ యూనియన్‌ల మధ్య నౌకాయానం హెచ్చుతుందని సోవియట్ నౌకాశాఖ ఉపమంత్రి వి. ఐ. జర్కోవ్ నేడిక్కడన్నారు.

భారత-సోవియట్ దేశాల మధ్య నౌకా ఒడంబడిక అమలు జరుగుతున్న తీరును సమీక్ష చేయడానికని భారత దేశానికి ప్రస్తుతం వచ్చిన సోవియట్ నౌకా ప్రతినిధి వర్గానికి జర్కోవ్ నాయకుడు. ఈ ప్రతినిధి వర్గంలో ముగ్గురు సభ్యులున్నారు.

ఉభయ దేశాలమధ్య నౌకాయానం ఏవిధంగా హెచ్చుతుందో ఖచ్చితంగా వివరించడానికి ఆయన యిష్టపడలేదు. అయితే సోవియట్ ప్రతినిధి వర్గానికి భారత ప్రభుత్వానికి మధ్య సంభాషణలు పూర్తిఅయినాయి. ఈ ప్రతినిధి వర్గం సింహళం వెళ్ళి తిరిగి ఢిల్లీకి వచ్చిన వెంటనే ఒడంబడికపై సంతకాలు జరుగుతాయని ఆయన చెప్పారు.

ఈ ఒడంబడికవలన ఉభయ దేశాలమధ్య వ్యాపారం పెరగగల అవకాశాలున్నవని ఆయనన్నారు.

ప్రస్తుతం ఉభయదేశాలమధ్య యేడాదికి ఏడు నౌకలు తిరుగుతూ వున్నాయి.

ఈ వేళ ఉదయం యిక్కడికివచ్చిన ప్రతినిధివర్గ సభ్యులకు విమానాశ్రయంవద్ద కలకత్తాలో సోవియట్ కాన్సల్-జనరల్, షిప్పింగ్ కార్పొరేషన్, షిప్పింగ్ కంపెనీల ప్రతినిధులు స్వాగతం యిచ్చారు.

ప్రతినిధివర్గం రేపు మద్రాసుకు బయలుదేరి వెళుతుంది.

ఆంధ్రరాజధానిలో రష్యా చలన చిత్రోత్సవం

హైదరాబాద్, అక్టోబరు 21

సోవియట్ చిత్రోత్సవాలను నిన్న సాయంత్రం ఇక్కడ ప్రభాత్ టాకీస్ వద్ద జరిగిన సమావేశంలో ఉస్మానియా యూనివర్శిటీ వైస్‌ఛాన్సలర్ డా. డి. ఎస్. రెడ్డి ప్రారంభోత్సవం చేశారు. ఈ సమావేశానికి పురప్రముఖులు అనేకమంది హాజరైనారు.

ఈ ఉత్సవాలకు సోవియట్ రాయబార కార్యాలయ ప్రధాన కార్యదర్శి ఎ. ఐ. వోల్కోవ్, భారతదేశంలోని సోవియట్ ఫిల్ముల ఎగుమతి శాఖ అధిపతులు కోరాకిన్ దోర్నీ, దోస్తోవస్కీలు కూడా హాజరైనారు.

డాక్టర్ డి యస్ రెడ్డి ప్రారంభోత్సవ ప్రసంగంలో, ఆర్థిక, తదితర అభివృద్ధి పనులకు భారతదేశానికి సహాయం అందచేస్తున్నందుకు సోవియట్‌ను ప్రశంసించారు. సాంస్కృతిక రంగంలోనూ సోవియట్ సహకారం వుండాలని ఉస్మానియా, సోవియట్ యూనివర్శిటీలమధ్య ప్రొఫెసర్ల-విద్యార్థుల రాకపోకలుండాలనికూడా శ్రీ రెడ్డి సూచించారు.

భారత-సోవియట్ సంబంధాలవలని అపారలాభాల్నిగూర్చి వోల్కోవ్ ప్రసంగించారు.

విజయ డిస్ట్రిబ్యూటర్ల తరఫున శ్రీ ఎస్. పార్థసారథి సోవియట్ అతిథులకు, వైస్-ఛాన్సలర్‌కు, సమావేశ అధ్యక్షునికి పూలమాలలు వేశా. తరువాత "సైనిక గీతం" చిత్రం ప్రదర్శించారు. (వి. వి)

సరిహద్దు పోరులో చనిపోయిన తొలి భారత సైనికులు

కాంగ్రెస్, కమ్యూనిస్టు తదితర పార్టీల శ్రద్ధాంజలి

న్యూఢిల్లీ, అక్టోబరు 20

మూడు సంవత్సరాలక్రితం దక్షిణ లడక్‌లో చైనావారితో పోరాడుతూ చనిపోయిన తొమ్మిదిమంది భారతీయ పోలీసులకు కాంగ్రెస్, కమ్యూనిస్టు, జనసంఘ్, ప్రజాసోషలిస్టు పార్టీలు జోహారు లర్పించాయి.

ఇండియా గేట్ వద్ద ఏర్పాటు చేసిన సభలో ఢిల్లీ మేయరూ, కాంగ్రెసు, కమ్యూనిస్టు, జనసంఘ్, ప్రజాసోషలిస్టు పార్టీల ప్రతినిధులూ పోరాటంలో అసువులు బాసిన పోలీసుల స్మృతికి పుష్పాంజలి సమర్పించారు.

న్యూఢిల్లీ మున్సిపల్ కమిటీ సీనియరు, జూనియర్ ఉపాధ్యక్షులు, భారతీయ యువకరక్షసంఘ్, భారత యువక సమాజం, మాజీ సైనికుల సంఘం, వార్తా ఛాయా చిత్రగ్రాహకుల సంఘం, పాత్రికేయుల,రచయితల సంఘాలు, మొదలగు సంస్థల ప్రతినిధులుకూడా పుష్పగుచ్ఛాలు సమర్పించారు.

పుష్పాంజలి తరువాత రెండు నిమిషాలపాటు అందరూ మౌనముద్ర ధరించారు. తదుపరి జాతీయగీతాలాపనతో సభ ముగిసింది.

భారత చైనా సేనలమధ్యపోరు

(1వ పేజీ తరువాయి)

విస్తరణతత్వపుకోర్కె, అహంకారం'తో సాగిస్తున్న చర్య అనీ రక్షణమంత్రి శ్రీ కృష్ణమీనన్ వ్యాఖ్యానించారు. సంప్రతింపులు జరుపుతామని వారు చెప్పడం "భారతదేశం కళ్ళల్లోనూ, ప్రపంచం కళ్ళల్లోనూ దుమ్ము చల్లేందుకు వేసిన ఒక ముసుగు" అని అన్నారు.

నేఫా ప్రాంతంలో నాలుగైదు అంగుళాల మందాన మంచు పడిందని వార్తలు వచ్చాయి. అయితే, వారి దాడికోసం మోహరించిన మూడుసైనిక శ్రేణులుగల ప్రాంతంలో భూమి ఏటవాలుగావుండి దానిమీద సూర్య కాంతి పడుతూంటుంది. కనుక చైనీయులకు సైనిక సప్లయి, రవాణాల సౌకర్యం హెచ్చుగా వుంది. వారి వాహనాలు కూడ ఉత్తరాన దాదాపు మాక్ మాహన్ రేఖవరకువచ్చి చేరుకొనగలవు.

నాంకా-చూనదికి ఉత్తరానగల జాంగ్లే చౌకిని సైనికవ్యూహం కారణాలవల్ల భారత సైనికులు రెండు రోజులనాడే ఖాళీచేశారు. ఇది మాక్ మాహన్ రేఖకూ, ఆ నదికి మధ్యలో వుంది; భూటాన్, నేఫా, టిబెట్‌ల కూడలికి ఎనిమైళ్ళ దూరంలో వుంది.

భూతల సేనలకు మద్దతుగా మామూలు రవాణా విమానాలకు మినహాయిస్తే వేరే వైమానిక దళాలకు చెందిన విమానాలను భారతదేశం ఉపయోగించలేదు.

నేఫాలో మాక్ మోహన్ రేఖను గాని లేక లడక్‌లో అంతర్జాతీయ సరిహద్దునుగాని దాటిపోరాదని భారత సేనలకు, సప్లయి విమానాలకు ఖచ్చితమైన ఉత్తరువులు యిచ్చామని రక్షణ మంత్రి శ్రీ మీనన్ నేడిక్కడచెప్పారు.

నేఫా ప్రాంతంమీద పెద్ద ఎత్తున దురాక్రమణ జరపడానికి గత మూడు నెలలనుంచీకూడా చైనీయులు తయారవుతూనే వుండి వుండాలని ఇక్కడ అధికారులు చెబుతున్నారు.

రక్షణమంత్రి ఇలా అన్నారు: "ప్రతి అంగుళం భూమికి మన సేనలు పోరాడతాయి; అయితే సైనికంగా రక్షించుకొనడానికి వీలులేనిచోట్ల ఉపసంహరించుకొంటాయి. వ్యత్యాసాలు హెచ్చుగా వున్నంత మాత్రాన మనం స్థలాలను ఖాళీచేయం. ఎక్కడెక్కడలకు సంబంధించిన విషయాలకే హెచ్చు ప్రాధాన్యముంటుంది; అది స్థానికంగా వున్నవారే నిర్ణయిస్తారు. మనం చాలాబాగా పోరాడగలాం."

భారత, చైనా పక్షాలు పొందిన మానవ నష్టాలు 1 : 4 రేషోతో వున్నాయని అధికారుల అంచనా.

చైనా దురాక్రమణ సమస్యను ఐక్యరాజ్య సమితికి తీసుకుపోయే విషయం గురించి భారత ప్రభుత్వం పరిశీలించ లేదనీ, దీనికి కారణం ఆసమస్యకు సంబంధించిన సైనిక రాజకీయ అంశాలమీదనే ప్రభుత్వం లగ్నమై వున్నదనీ శ్రీ మీనన్ విలేకరులతో చెప్పారు.

ధోలా చౌకీవద్ద చైనీయుల దళమైనదని ఇక్కడి అధికారరీత్యా తెలిపారు. ఆ ప్రాంతంలో నదికి దక్షిణాన పదిపన్నెండుమైళ్ళ పొడవు రంగంలో ప్రస్తుతం పోరు సాగుతున్నది. చైనీయులు నదిని దాటారు.

ధోలా చౌకి రెండు పార్శ్వాలా వున్న భారతసేనలు, ఆ చౌకీకి వెనుకభాగాన గల కొండలమీద పునర్వ్యవస్థీకరింపబడుతున్నాయి.

లడక్ రంగంలో చిప్ చాప్ నదీప్రాంతంలో ఇంకా ఉత్తరాన మూడు చౌకలమీద నేటి ఉదయం చైనీయులు దాడి చేశారు. ఇవి చిన్న చౌకీలు; ఇందులో రెండు చైనీయులకు పట్టుబడ్డాయి.

ధోలా ప్రాంతంలో నేటి ఉదయం వరకు ఉన్న పరిస్థితి ఏమిటంటే, నాంకా-చూ నదిమీద పోరు సాగుతున్నది; ఈ నదినే చైనావారు కేచిలాంగ్ నది అంటారు.

అధికార ప్రకటన

నేటి సాయంత్రం విడుదలైన అధికార పత్రికా ప్రకటనలో ఇలా తెలిపారు:

"ఆటోమాటిక్ ఆయుధాలు ధరించి, తగినంత సంఖ్యలో చైనా బలాలు తెరలు తెరలుగా మన స్థావరాలపై దాడిచేస్తున్నాయి భారీ మోర్టార్లు, మెషిన్‌గన్నులు, మరతుపాకులు ఉపయోగిస్తున్నాయి. ప్రతి అంగుళంభూమి కోసం మన సేనలు సాహసంతో పోరాడుతున్నాయి. అయినప్పటికీ అధిక సంఖ్యలోగల సేనలను, భారీ కాల్పులను ఎదుర్కొనవలసి వచ్చినా చాలా తీవ్రంగా పోరుసలిపిన తర్వాత మన వారు ఉపసంహరించుకున్నారు. ఖింజమానేలో వున్న మన సరిహద్దు చౌక చివరితుపాకిగుండువరకూ పోరాడిన తర్వాతనే పడిపోయినది. ప్రస్తుతం నాంకా-చూ నదికి దక్షిణాన కొద్ది దూరంలో పోరు భీకరంగా సాగుతోంది.

"గాయపడినవారిని తరలించే హెలికాప్టర్ విమానాన్ని ఒకదానిని చైనీయులు కూల్చారు.

"లడక్‌లో, ఇంతకు పూర్వమే తెలియజేసినట్లు, ఉత్తరాన మూడు చౌకీలమీద చైనీయులు ఒకేసారి దాడి ఆరంభించారు. ఇక్కడ కూడ వ్యత్యాసాలు చాలా హెచ్చుగా వున్నప్పటికీ మన సేనలు నిబ్బరంగా పోరాడాయి, గాని ఇంతకంటె మంచి రక్షణ స్థావరాలు ఏర్పరచుకొనడంకోసం ఒకటి రెండు చౌకీలనుండి ఉపసంహరించుకొనవలసి వచ్చింది.

"ఈ రెండురంగాలలో జరిగిన పోరులో మనకష్టం నష్టాలుపొందింది. అవి ఎంతో తెలియదు. అయితే ప్రతి సారీకూడ దాడిచేస్తున్న చైనీయులకు చాలా హెచ్చు నష్టాలు కలిగించడం జరిగింది.

"చైనా విధానం ఇప్పుడు స్పష్టం అవుతూంది ఒకవైపున శాంతియుత పరిష్కారంకోసం సంభాషణలు కావాలని అంటున్నారు, మరొక వైపున మన భూభాగంమీద పెద్ద యెత్తున దురాక్రమణకు తయారవుతున్నారు. చైనా దాడి స్థాయి, దానితో [illegible] అందుకోసం చాలా కాలంగా తయారై, కావాలని దాడులు చేసి నిర్వహిస్తున్నారని తెలుస్తున్నది."

భారత సేనలు సకలశక్తులతో దాడి మొదలుపెట్టాయని చైనా రక్షణశాఖ

పెకింగ్, అక్టోబరు 20

భారత-చైనా సరిహద్దు మీద భారతసేనలు 'సకలశక్తులతోదాడి' ఆరంభించాయని నేటి రాత్రి చైనా రక్షణమంత్రిత్వశాఖ ప్రకటించింది.

స్వరక్షణకోసం చైనా సరిహద్దు కాపలా దళాలు ఎదురుదెబ్బ తీయవలసి వచ్చిందనీ, చైనా భూభాగంలో నెలకొల్పిన కొన్ని భారత స్థావరాలను ఖాళీ చేయించాయనీ నవచైనా వార్తా సంస్థ తెలిపింది.

చైనా వారే దాడి ఆరంభించారని భారత రక్షణమంత్రి శ్రీ కృష్ణమీనన్ చేసే వాదనలు "నీలాప నిందలతో నిండిన అబద్ధాలు" అని చైనా రక్షణ మంత్రిత్వశాఖ ప్రతినిధి ఒకరు త్రోసిపుచ్చారు.

సరిహద్దుపై రెండురంగాలనుండి వచ్చే తాజావార్తలవల్ల పోరు అతి తీవ్రంగా సాగుతూనే వున్నదని తెలుస్తున్నదని చైనా ప్రకటనలో వున్నదని నవచైనా వార్తా సంస్థ చెప్పింది.

ఈ రోజు చివరకు జేసిన ఆ ప్రకటనలో ఇలా వుంది: "భారత సైనికులు సాగించిన చాలా దాడులను చైనా సరిహద్దు కాపలా దళాలు ఓడించాయి; ఖింజమానే, చెడాంగ్, కాలుంగ్‌లను తిరిగి స్వాధీన పరచుకొన్నాయి."

పశ్చిమ రంగంలో జరుగుతున్న భారతీయ దాడులను "పూర్వ రంగంలో పెద్దఎత్తున జరుపుతున్న తమ దాడితో సమన్వయించారన్నది స్పష్టమే"నని అందులో చెప్పారు.

చైనా రక్షణమంత్రిత్వశాఖ ప్రకటనలో ఇంకా ఇలా చెప్పారు:

"ప్రస్తుత పరిస్థితి యీలాంగా ఉత్పన్నమయ్యే తీవ్ర పరిణామాలకు భారత ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించవలసి వుంటుంది."

చైనా-భారతసరిహద్దు వివాదాన్ని శాంతియుతంగా పరిష్కరించుకొనడానికి చైనా చేసిన ప్రతిపాదనలను భారత ప్రభుత్వం నిరాకరించిందని ఆ ప్రకటన చెప్పింది.

సరిహద్దు కాపలా దళాల విషయం ప్రస్తావించి ఆ ప్రకటన ఇలా అన్నది:

"దృఢంగా జవాబిచ్చి, భారత సైనికులు ఆక్రమించిన భూభాగాన్ని తిరిగి స్వాధీనపరచుకోవడం మినహా చైనీయులకు మరో ప్రత్యామ్నాయం ఏదీలేదు".

సరిహద్దుల్లో భారత వైఖరి

అమెరికా డాలరుసహాయంతో సంబంధం ఉన్నదని చైనా వార్తాసంస్థ వ్యాఖ్య

టోకియో, అక్టోబరు 20

చైనాపైన దాడిని ఉధృతం చేసినప్పటినుండి అమెరికానుండి భారతదేశం ఎక్కువ సహాయాన్ని పొందుతున్నదని నవచైనా వార్తాసంస్థ నేడు ప్రకటించింది.

పెకింగునుండి విడుదలచేసిన పత్రంలో వార్తా సంస్థ ఇలా తెలియజేసింది.

"చైనా వ్యతిరేక ప్రచారం 1959లో భారతదేశం సాగించింది. అప్పటినుండి భారతదేశానికి వచ్చిన డాలర్లు అంతకుముందు దశాబ్దంలో పొందిన దానికి రెట్టింపు.

గత వసంతఋతువులో చైనాపైన కవ్వింపుచర్యలు, చైనా భూభాగంలోనికి చొచ్చుకొనిరావడం భారతదేశం ప్రారంభించింది. అప్పటి నుండి కెన్నడీ ప్రభుత్వంమరింతఔదార్యాన్ని చూపుతోంది.

అమెరికా వ్యవసాయ అదనపుసరకుల సంబంధించిన భారత-అమెరికా ఒప్పందం ప్రకారం గత మార్చినెలలో 250 కోట్ల రూపాయలు అమెరికా అప్పు ఇచ్చింది.

ఇవన్నీ కాదనలేని సత్యాలు. వీటన్నింటిదృష్ట్యా ఇంకా ఎక్కువ డాలర్లకోసమై చైనా వ్యతిరేక ప్రచారాన్ని భారతదేశం ఉధృతం చేసిందంటే అందులో ఆశ్చర్యమేమీలేదు. అమెరికా ఆర్థికసహాయానికి, సరిహద్దు తగాదాపై భారత ప్రభుత్వ వైఖరికి ఎలాంటి సంబంధమూ లేదని రుజువు చేయడానికి భారత అభివృద్ధి నిరోధకుల వశం కాదు.

చైనాను శత్రుదేశంగా ప్రకటించాలని

శ్రీ త్యాగి

న్యూఢిల్లీ, అక్టోబరు 20

సరిహద్దులో తాజాగా జరిగిన ఘటనలదృష్ట్యా పెకింగ్‌లోని తన రాయబారి కార్యాలయాన్ని భారత ప్రభుత్వం మూసివేయాలని పార్లమెంటు సభ్యుడు శ్రీ మహావీరత్యాగి నేడు సూచించారు.

ఆయన ఒక ప్రకటన చేస్తూ యిలా అన్నారు:

"భారతదేశంపై ఈ విధంగా శత్రు దాడి చేసిన తరువాత చైనాతో దౌత్య సంబంధాలను అట్టేపెట్టుకోవలసిన అవసరం ఏంకోమాత్రంలేదు. కనుక వెంటనే మన దౌత్యసంబంధాలను ఉపసంహరించుకొని చైనాను శత్రు దేశంగా ప్రకటించాలి."

ప్రభుత్వ రంగంలో మరికొన్ని నూనెశుద్ధి కర్మాగారాలు

శ్రీ కె. డి. మాలవియా వెల్లడి

న్యూఢిల్లీ, అక్టోబరు 20

దేశంలో నూనె వసతులను ద్విగుణీకృతం చేసే పథకంలో భాగంగా, ప్రభుత్వ రంగంలో ఎక్కువ నూనె శుద్ధి కర్మాగారాలను ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలగురించి ఆలోచిస్తున్నామని కేంద్ర నూనెవనరుల మంత్రి శ్రీ కె. డి. మాలవియా నేడు అన్నారు.

విదేశ పర్యటనకు వెళ్ళబోయేముందు [illegible] విలేకరులతో మాట్లాడుతూ [illegible] రంగంలో ఒక నూనె శుద్ధి కర్మాగారం నిర్మించే ఆలోచన [illegible] అన్నారు.

విదేశీకంపెనీలు [illegible] అని మంచి [illegible] డానికి ఆయన [illegible] ఇస్తారా అని ఒక విలేకరి ప్రశ్నించగా అది మావల్ల సాధ్యం కాదని ఆయన అన్నారు.

శ్రీ కె. డి. మాలవియా అక్టోబరు 23వ తేదీనుండి [illegible] పాటు సోవియట్ యూనియన్, పోలెండు, రుమేనియా [illegible] పర్యటించి రావడానికి వెళుతున్నారు.

పోలెండ్‌లో [illegible] ఆయన [illegible] పెంపొందించడానికి అవకాశాలను పరిశీలించి [illegible] మూడుదేశాల [illegible] నూనె [illegible] అభివృద్ధి చేయడానికిగల అవకాశాలను గురించి చర్చిస్తారు.

రేడియో

మంగళవారం, అక్టోబరు 23
శక 1884, కార్తీక 1

విజయవాడ

857.1 మీ (840 కిలోసై)

ఉదయం. 6-30 శుభోదయం, 6-35 భక్తిరంజని (సంప్రదాయ కీర్తనలు): వి. శ్రీనివాసన్, బృందం, 6-55 ప్రసార తరంగిణి; 7-0 తె. వా, 7-15 సంగీత శిక్షణ; 7-30 సి మునిరత్నమ్మ, 8-0 ఆం. వా, 8-15 హిం. వా, 8-30 గాత్ర సంగీతం, 9-0 ప్రసార సమాప్తి.

మధ్యాహ్నం. 11-30 రాష్ట్రగానం, 11-40 ఉన్నత పాఠశాలలకు (హైదరాబాద్ నుండి రిలే), 12-10 గీతమంజరి, 12-30 కార్మికుల కార్యక్రమం (హై రి), 1-0 పేరంటం, 1-30 సి మునిరత్నమ్మ; 1-50 తె. వా, 2-0 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

సాయంత్రం. 6-0 స్థానిక ప్రకటనలు, 6-5 ప్రాం. వా, 6-15 గ్రామస్థుల రేడియో గోష్ఠి, 7-0 తె. వా, 7-15 గ్రామస్థుల కార్యక్రమం, 7-30 సంగీత్ సమ్మేళన్ (మ రి), 8-30 ఉభయ కుశలోపరి; 8-45 ఫిల్మ్ సంగీతం, 9-0 ఆం వా, 9-15 నవ రచన, 9-30 సంగీత్ సమ్మేళన్ (ఢి. రి); 11-0 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

హైదరాబాద్-ఎ

405.4 మీ (740 కిలోసై.)

ఉదయం 6-30 సుప్రభాత్, 6-35 భక్తిరంజని (వి రి), 6-55 కార్యక్రమ వివరణ, 7-0 తె వా, 7-15 సంగీత శిక్షణ (వి రి), 7-30 సారంగి, 7-45 భక్తి సంగీత్, 8-0 ఆం. వా, 8-15 హిం. వా; 8-30 విజయవాడవలె; 9-0 ప్రసార సమాప్తి.

మధ్యాహ్నం: 11-40 ఉన్నత పాఠశాలలకు, 12-10 ఉన్నత పాఠశాలలకు [ఉర్దూ], 12-30 కార్మికుల కార్యక్రమం; 1-0 భజన్; 1-15 సారంగి, 1-30 వాద్యగోష్ఠి, 1-50 తె వా; 2-0 హై. బి వలె, 2-10 ఉ. వా, 2-20 హై. బి. వలె, 2-30 ప్రసార సమాప్తి.

సాయంత్రం 6-0 స్థానిక ప్రకటనలు, 6-05 ప్రాం. వా; 6-15 సుగమ్ సంగీత్, 6-30 నగరవాణి, 7-0 తె. వా, 7-15 కన్నడ శ్రోతలకు, 7-30 రేడియో సంగీత్ సమ్మేళన్ (ఢి. రి), 8-30 చిత్తూర్ సుబ్రహ్మణ్య పిళ్ళై, 9-0 ఆం వా; 9-15 ఉ వా, 9-30 హై బి. వలె; 11-0 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

హైదరాబాద్-బి

60.12 మీ (4990 కిలోసై.)

ఉదయం. 6-30 హై ఎ. వలె, 7-45 సమాప్తి

8-0 హై. ఎ. వలె, 9-0 ప్రసార సమాప్తి.

42.02 మీ (7140 కిలోసై)

మధ్యాహ్నం: 11-40 హై ఎ వలె, 12-10 వి లక్ష్మి, 12-30 హై ఎ వలె, 2-0 వాతావరణ సూచన, వి. లక్ష్మి; 2-30 ప్రసార సమాప్తి.

సాయంత్రం 6-0 హై ఎ వలె, 6-15 గ్రామస్థుల రేడియో గోష్ఠి, 7-0 తె. వా. 7-15 గ్రామస్థులకు, 7-30 హై. ఎ వలె, 9-15 శాస్త్రీయ సంగీతం, 9-30 రేడియో సంగీత్ సమ్మేళన్ (ఢి. రి), 11-0 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి

మద్రాస్-బి

211 3 మీ (1420 కిలోసై)
60 98 మీ (4920 కిలోసై)

ఉదయం 6-45 మంగళగానం, 7-0 తె వా, 7-15 సంగీతమంజరి, 7-30 సాక్సొఫోన్ ఎ జి. సుబ్రహ్మణ్యం, 7-45 రేడియో శెయిదిమలర్ వార్తా వాహిని (తమిళం), 8-0 ఆం వా. 8-15 ప్రసార సమాప్తి.

మధ్యాహ్నం 12-0 కార్మికుల కార్యక్రమం [తమిళం] (తి.రి), 12-30 మాధ్యమిక పాఠశాలలకు, 1-0 కదంబం, 1-30 ఆం వా, 1-40 గీత మంజరి, 1-50 తె వా, 2-0 మధుర గీతం, 2-10 ఉన్నత పాఠశాలలకు, 2-40 ప్రసార సమాప్తి.

సాయంత్రం 5-30 పాశ్చాత్య సంగీతం, 6-0 ఆం. వా, 6-05 ప్రాంతీయ శెయిదిగళ్, 6-15 వాతావరణ సూచన, స్థానిక ప్రకటనలు, వాణిజ్య వార్తలు (ఆంగ్లం), 6-25 కార్యక్రమ వివరణ (తమిళం), 6-30 ఎస్. జగలక్ష్మి, 7-0 తె వా, 7-15 [illegible], 7-30 రేడియో సంగీత్ సమ్మేళన్, 8-30 జ వైదేహి, 9-0 ఆం వా, 9-15 కంబ రామాయణం (తమిళ కథానిక), 9-30 ఆంగ్లము, 10-0 మ ఎ వలె, 11-0 ప్రసార సమాప్తి.

రాణిగంజ్ బొగ్గుగని ప్రాంతంలోని అండాల్ - సానాగార రైలు మార్గాన్ని జంటమార్గం చేయాలని రైల్వేమంత్రిత్వశాఖ నిశ్చయించింది

◆ ◆ ◆

ఢిల్లీలోని వ్యవసాయ పరిశోధనా సంస్థను జాంజిబార్ మంత్రి షేక్ జుమా, తదితరులు సందర్శించారు.

ఈ వారం ధరల సమీక్ష

విజయవాడ, అక్టోబరు 20

విజయవాడ వ్యవసాయ మార్కెటింగ్ ఆఫీసర్ నేడు అందచేసినది 20-10-62 తో అంతమయ్యే వారములోని ధరల సమీక్ష.

(ఒక క్వింటాల్ ధరలు ఒక క్వింటాల్ అనగా 100 కిలోగ్రాములు లేక 220½ పౌన్లు)

ధాన్యం - ఒకటవ రకం: నెల్లూరులో మొలకొలుకులు రు 1-00 పెరిగినది. పార్వతీపురంలోకూడా రు 1-34 పెరిగింది. రెండవరకం: నర్సాపురంలో సన్నాలు రు 1-25 పెరగగా, పాలకొల్లులో అక్కుళ్ళు రు 1-00 తగ్గినది.

బియ్యం - ఒకటవ రకం: గుంటూరులో సన్నాలు 1-25 పెరగగా, సన్న కృష్ణకాటుకలు రు 1-00 తగ్గినది రెండవ రకం: తాడేపల్లిగూడెంలో అక్కుళ్ళు రు 2-70 లు, ఆముదాలవలసలో రు 1-13 పెరిగింది.

నార. కలకత్తా అస్సాం బాటం రు 1-34 లు తగ్గినది. రెండవ రకం: విజయనగరంలో రు 2.68, ఆముదాలవలసలో రు 2.00 లు తగ్గినది మూడవ రకం: ఆముదాలవలసలో రు 2.67 తగ్గినది.

వేరుశనగ కాయలు; నంద్యాలలో రు 1-25, కడపలో రు 6-95 అనంతపురంలో రు 2-07, విజయనగరంలో రు 4-66 పెరగగా, విజయవాడలో రు 2-2, ఆముదాలవలసలో రు 5-15 నర్సరావుపేటలో రు 1-40 తగ్గినది.

పప్పు: విజయవాడలో రు 4-00, నంద్యాలలో రు 3-75, అనంతపురంలో రు 1-59 విజయనగరంలో రు 1-33 ఆముదాలవలసలో రు 3-67 పెరిగినది.

నూనె: గుంటూరులో రు. 3-00, నంద్యాలలో రు. 3-70 లు, అనంతపురంలో రు. 4-14లు, విజయనగరంలో రు. 9-88 లు, ఆముదాలవలసలో రు 6-67 లు పెరగగా, విజయవాడలో రు. 5-50 లు, తెనాలిలో రూ. 1-30 తగ్గినది.

అపరాలు: కందులు: విజయవాడలో రు 3-00, గుంటూరులో రు. 4-00 లు పెరగగా, ఆముదాలవలసలో రు. 1-40 లు, పార్వతీపురంలో రు. 1-07 తగ్గినది.

మినుములు. విజయవాడలో రు. 1-40, గుంటూరులో రు 1-00 విజయనగరంలో రు. 1-07, ఆముదాలవలసలో రు. 2-07 లు పెరగగా. రాజమండ్రిలో రు. 2-00 లు తగ్గినది.

పెసలు: విజయవాడలో రు. 1-00 గుంటూరులో రు 1-00 పెరిగినది

శెనగలు: గుంటూరులో రు. 4-36 పెరగగా, విజయవాడలో రు. 3-00లు ఆముదాలవలసలో రు. 1-82లు తగ్గినవి

జీడిపప్పు: రాజోలులో రు. 1-00 బద్దల ధర తగ్గినది.

పసుపు: కొమ్ములు - కడపలో రూ 3-00 లు పెరిగినది దుంపలు: కడపలో రూ 6-00 లు తగ్గినది

బెల్లం: ఒకటవరకం. అనకాపల్లిలో రూ 6-10 లు తగ్గినది. రెండవరకం: అనకాపల్లిలో రూ 4-60 లు తగ్గినది. మూడవరకం. అనకాపల్లిలో రూ 4-90 లు తగ్గినది.

పొగాకు: విజయవాడలో రూ 7-00 లు పెరిగినది.

ఉల్లిపాయలు తాడేపల్లిగూడెంలో రూ 1-00 పెరగగా హిందూపురంలో బళ్ళారిరకం రూ 3-75 లు తగ్గినది.

జొన్నలు - నర్సరావుపేటలో పచ్చజొన్నలు రూ 3-00లు తగ్గినవి. నెయ్యి గుంటూరులో నెయ్యి రూ 30-00 లు పెరిగినది మిర్చి దేశవాళిరకం గుంటూరులో రూ. 5-00 పెరిగినది. దర్జీరకం- గుంటూరులో రూ 5-00 పెరిగినది

కొబ్బరికాయలు కొత్తవి - విజయవాడలో రూ 5-00 పెరిగినది పాతవి రాజమండ్రిలో రూ 10-00, విజయవాడలో 7-00 పెరిగింది. పచ్చిమిర్చి - సన్నవి- రాజమండ్రిలో రూ 5-00 లు పెరిగినది.

చిక్కవోలులో ధాన్యం, బియ్యం ధరలు

మొలగొలకలు · 38 33 60 36
రెండవరకం. అక్కుళ్లు 37 00
అక్కుళ్లు 59 36

జంగారెడ్డిగూడెం మార్కెటులో వ్యవసాయపంటల ధరలు

1. పొగాకు 336 00
2. ఉలవలు 42 00 రు 2.00 ధర తగ్గినది
3. చింతపండు 71.00 రు 1 00 పెరిగినది.
4. కుంకుడు 72 00 రు. 1 00 పెరిగినవి.

1. నిల్వలు (క్రిందటి వారపు నిల్వలు ఈ వారపు దిగుమతులతో సహా ఉన్న 7,383 క్వింటాల్సు బియ్యంలో, 3,046 క్వింటాల్సు బియ్యం ఖర్చు కాగా, ఈ వారాంతము చిక్కవోలు మార్కెట్ లో 4337 క్వింటాల్సు బియ్యం నిలువయున్నవి

2. ఏలూరు మార్కెట్టులో క్రిందటి వారపు నిల్వలు ఈ వారపు దిగుమతులతో సహా ఉన్న 15,939 క్వింటాలు, బియ్యంలో 9893 క్వింటాల్సు బియ్యం ఖర్చుకాగా వారాంతములో 6046 క్వింటాలు బియ్యం నిలువయున్నవి.

3. కాకినాడలో క్రిందటి వారపు నిల్వలు ఈ వారపు దిగుమతులతో సహా ఉన్న 12,284 క్వింటాల్సు బియ్యంలో 3476 క్వింటాల్సు బియ్యం ఖర్చు కాగా వారాంతములో 8808 క్వింటాల్సు బియ్యం నిల్వయున్నవి.

4. రేపల్లె మార్కెట్టులో క్రిందటి వారం నిల్వలు, యీ వారపు దిగుమతులతో సహా ఉన్న 4258 క్వింటాల్సు బియ్యంలో 468 క్వింటాల్సు బియ్యం ఖర్చుకాగా, మిగిలియున్న వారాంతమునకు నిల్వ 3785 క్వింటాల్సు బియ్యం.

5. తెనాలిమార్కెట్టులో క్రిందటి వారం నిల్వలు యీ వారపు దిగుమతులతో సహా ఉన్న 3976 క్వింటాల్సు బియ్యంలో 2772 క్వింటాల్సు బియ్యం ఖర్చు కాగా మిగిలియున్న 1204 క్వింటాల్సు బియ్యం నిల్వ.

6. జంగారెడ్డిగూడెంమార్కెట్టులో క్రిందటి వారపు నిల్వలు యీ వారపు దిగుమతులతో సహా ఉన్న 5940 క్వింటాల్సు పొగాకు 125 క్వింటాల్సు ఉలవలు, 105 క్వింటాల్సు చింతపండు, 90 క్వింటాల్సు కుంకుళ్లులో 200 క్వింటాల్సు పొగాకు, 60 క్వింటాల్సు ఉలవలు, 70 క్వింటాల్సు చింతపండు, 60 క్వింటాల్సు కుంకుడు ఖర్చుకాగా మిగిలియున్న వారాంతములో నున్న నిల్వ 5740 క్వింటాల్సు పొగాకు, 65 క్వింటాల్సు ఉలవలు, 70 క్వింటాల్సు చింతపండు, 60 క్వింటాల్సు కుంకుళ్లు

7. గుంటూరు మార్కెట్టులో క్రిందటివారపు నిల్వలు యీ వారపు దిగుమతులతో సహా ఉన్న 8784 క్వింటాల్సు బియ్యం, 4770క్వింటాల్సు అపరాలు, 750 క్వింటాల్సు మిర్చి, 1040 క్వింటాల్సు నెయ్యిలలో 650 క్వింటాల్సు బియ్యం, 775 క్వింటాల్సు అపరాలు, 40 క్వింటాల్సు మిర్చి, 200 క్వింటాల్సు నెయ్యి ఖర్చుకాగా వారాంతంలో 8134 క్వింటాల్సు బియ్యం, 3995 క్వింటాల్సు అపరాలు 710 క్వింటాల్సు మిర్చి, 820 క్వింటాల్సు నెయ్యి నిల్వయున్నది.

8. రాజమండ్రి మార్కెట్టులో క్రిందటి వారపు నిల్వలు యీ వారపు దిగుమతులతో సహాఉన్న 82 క్వింటాల్సు కందులు, 211 క్వింటాల్సు మినుములు, 80క్వింటాల్సు పెసలు, 277 క్వింటాల్సు శెనగలలో 10 క్వింటాల్సు కందులు, 60క్వింటాల్సు మినుములు, 5 క్వింటాల్సు పెసలు 25 క్వింటాల్సు శెనగలు ఖర్చుకాగా, 72 క్వింటాల్సు కందులు, 281 క్వింటాల్సుమినుములు, 75 క్వింటాల్సు పెసలు, 252 క్వింటాల్సు శెనగలు వారాంతములో నిల్వయున్నవి.

9. విజయవాడ మార్కెట్టులో క్రిందటి వారపునిల్వలు యీ వారపు దిగుమతులతో సహా ఉన్న 11,180 క్వింటాల్సు బియ్యం, 2020 క్వింటాల్సు కందులు 2475 క్వింటాల్సు మినుములు, 4160 క్వింటాల్సు పెసలు, 3030 క్వింటాల్సు శెనగలలో 980 క్వింటాల్సు బియ్యం, 500 క్వింటాల్సు కందులు, 585 క్వింటాల్సు మినుములు, 765 క్వింటాల్సు పెసలు, 500 క్వింటాల్సు శెనగలు ఖర్చుకాగా, వారాంతములో మిగిలియున్న నిల్వ 1380 క్వింటాల్సు బియ్యం, 1520 క్వింటాల్సు కందులు, 1890 క్వింటాల్సు మినుములు, 3395 క్వింటాల్సు పెసలు, 1012 క్వింటాల్సు శెనగలు యున్నవి.

శ్రీ వెలిదండ్ల హనుమంతరాయ వర్థంతి

ఆయన త్యాగనిరతిని ప్రశంసిస్తూపలువురిప్రసంగాలు

విజయవాడ, అక్టోబరు 21

శ్రీ వెలిదండ్ల హనుమంతరాయ వర్థంతి నిన్న సాయంత్రం యిక్కడ హనుమంతరాయ గ్రంథాలయ హాలులో జరిగింది.

సభకు శ్రీ సీలంరాజు వెంకటశేషయ్య అధ్యక్షత వహించారు.

గ్రంథాలయ ప్రధాన కార్యదర్శి శ్రీ వెల్లంకి వెంకటేశ్వరరావు స్వాగతం చెప్పారు.

అధ్యక్షులు శ్రీ శేషయ్య ప్రసంగిస్తూ, స్వర్గీయులైన డాక్టర్ హనుమంతరావు మహోన్నతమైన చరిత్రగల వ్యక్తి, ఆయన పేర నిర్వహింపబడుతున్న యీ గ్రంథాలయానికి సర్వలక్షణ లక్షితమైన భవనం ఒకటి ఏర్పడటం అవసరమ, గ్రంథాలయ సర్వతోముఖాభివృద్ధికి అందరూ సహాయపడాలని విజ్ఞప్తి చేశారు. ఇతర రాష్ట్రాలలోని మహనీయులను గౌరవించడానికి పూనుకునేముందు, మన రాష్ట్రంలోని ఆదర్శవ్యక్తుల స్మారక చిహ్నాలు ఉచిత రీతిని నెలకొల్పడానికి పూనికవహించడం సముచితమన్నారు. విజయవాడలోని మ్యూజియంను ఎంతైనా అభివృద్ధి చేయవలసి ఉందన్నారు.

శాసన సభ్యుడు డాక్టర్ టి వి. యస్. చలపతిరావు సభను ప్రారంభిస్తూ, హనుమంతరావుగారి త్యాగనిరతిని, దేశభక్తిని కొనియాడారు.

డాక్టర్ సంధ్యాల దక్షిణామూర్తి ప్రసంగిస్తూ, హనుమంతరావుగారు మితభాషిఅనీ, స్ఫూర్తిగల విహారి, చిత్తశుద్ధిగల వ్యక్తి అని, సేవాదృష్టి ప్రధానంగా గల వ్యక్తి అనీ చెప్పారు

శ్రీయుతులు కాకరపర్తి భావనారాయణ, డాక్టర్ చాగంటి సూర్యనారాయణ, శ్రీరాం భీమశంకరం గార్లు కూడా సభలో ప్రసంగించారు.

శ్రీ వెంకటేశ్వరరావు వందన సమర్పణతో సభముగిసింది.

పారిశుధ్య విషయంలో విజయవాడఅధ్వాన్నస్థితి

జనాభాకు తగినంత సిబ్బంది లేదనీ, పరికరాలు లేవనీ, ఆరోగ్య శాఖాధికారి విమర్శ

విజయవాడ, అక్టోబరు 20

విజయవాడలో పారిశుధ్య పరిస్థితి చాలా అధ్వాన్నంగా ఉందనీ, జనాభాకు తగినంతగా సిబ్బంది లేదనీ, పనిముట్ల కొరతకూడా ఎక్కువగా ఉందని మునిసిపల్ ఆరోగ్యశాఖాధికారి శ్రీ యస్. యల్. సాగర్ యీ రోజు సాయంత్రం మునిసిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశంలో జరిగిన చర్చకు సమాధానం యిస్తూ వెల్లడించారు.

తాను అధికారం స్వీకరించే సమయానికి ఒక ఔన్సు బ్లీచింగ్ పౌడరు కూడా నిల్వలేదనీ, వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారనీ, అందువలన కలరా వ్యాధి వ్యాపించటానికి కారణమైందన్నారు.

పట్టణంలో కలరావ్యాధి ఏ విధంగా ప్రారంభమైందీ, ఆ కలరావ్యాధి నిరోధానికి ఆరోగ్య శాఖ తీసుకున్న చర్యలను వివరించి ప్రస్తుతం కలరా వ్యాధి అదుపులో ఉందనీ, చిన్న పిల్లలకు మాత్రం కొత్తగా సోకుతోందని తెలియజేశారు.

పట్టణ పారిశుధ్య విషయం వివరిస్తూ పట్టణ జనాభా అవసరాల దృష్ట్యా 39 మంది హెల్త్ ఇన్‌స్పెక్టర్లు ఉండవలసి ఉండగా, కాని నేడు 18 మంది మాత్రమే ఉన్నారనీ తెలియజేశారు. శానిటరీ మేస్త్రీల కొరత కూడా ఎక్కువగా ఉన్నదన్నారు. మునిసిపల్ కార్మికుడు పాకీదొడ్లుమాత్రం బాగుచేయవలసి ఉండగా, నేడునూరు నుండి నూటయాభై దొడ్లవరకు బాగుచేయవలసి వస్తోందనీ, దీనివలన కార్మికునికి శక్తికిమించిన పని అవుతోందనీ తెలియజేశారు.

చెత్తా, చెదారాన్ని, మలాన్ని చేరవేయటానికి తగినన్ని వాహనాలు కూడా లేవన్నారు. ప్రస్తుతం 18 చెత్త తోలే లారీలు, 4 మలాన్ని చేరవేసే లారీలు మాత్రం ఉన్నాయనీ, 52 ఎద్దుబండ్లు ఉన్నాయనీ, అందులో పదిఎద్దులు పనికిరాని స్థితిలో ఉన్నాయన్నారు. ఇవిఏమాత్రంచాలవన్నారు.

మునిసిపాలిటీకి యిన్ని లారీలు, సెప్టిక్ ట్యాంకులు ఉన్నప్పటికీ ఒక మెకానిక్కు కూడా లేడనీ, ప్రైవేటుగా మరమ్మత్తు చేయించవలసి వస్తోందనీ, దీనివలన ఆలస్యం జరుగుతోందనీ చెప్పి, రెండు సంవత్సరాలనాడు జబ్బుపోయిన రెండు లారీలు యింతవరకు బాగుచేయక పోవటాన్ని ఉదహరించారు

విజయవాడ వేసవికాలంలో పనికొచ్చే పట్టణమే కాని, వర్షాకాలంలో పనికివచ్చేది కాదనీ, పారిశుధ్య పరిస్థితి మరీ విచారకరంగా ఉందన్నారు. దీని పరిష్కారానికి కౌన్సిల్ ప్రత్యేకంగా ఒక ఆరోగ్య ఉపసంఘాన్ని వేయాలని సూచించారు.

బైటనుండి వచ్చే పాలను అరికట్టటంపై వచ్చిన విమర్శను ప్రస్తావించి, చుట్టుపట్ల గ్రామాలలో కూడా కలరా వ్యాపించి ఉండటంవలన పాలను రానీయకుండా చేయటం అవసరమైందనీ, దీనిని సడలించటానికి వీలు లేదనీ, పాలపొడి, పాలడబ్బాలు అవసరాలకు ఉపయోగించుకోవచ్చునీ చెప్పారు.

చర్చ వివరాలు

పట్టణంలో పారిశుధ్య పరిస్థితులు చాలా అధ్వాన్నంగా ఉన్నాయనీ, కలరావిరిగిన ప్రాంతాలలో చేసినట్లుగా పట్టణంలోని మిగిలిన ప్రాంతాలలోని మురికి పేటలలో కలరా నిరోధక చర్యలు ఎక్కువగా తీసుకోవాలనీ నేటి సాయంత్రం జరిగిన మునిసిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశంలో ప్రసంగించిన సభ్యులంతా కోరారు.

సమావేశానికి మునిసిపల్ అధ్యక్షుడు శ్రీ యస్. ఎం. ఎ. ఖద్దూస్ అధ్యక్షత వహించారు.

పట్టణంలో ప్రబలియున్న కలరా వ్యాధి నిరోధించుటకు తీసుకున్న చర్యలగురించి, ఆరోగ్య శాఖాధికారి నివేదికను చర్చించుటకు, ఓవర్ బ్రిడ్జి కట్టడమునుగురించి మునిసిపల్ ఇంజనీరు గారి సూచన చర్చించుటకు, మంచి నీటి సరఫరా విషయం చర్చించుటకు ఈ అత్యవసర సమావేశం అధ్యక్షులు ఏర్పాటు చేశారు.

సమావేశ ప్రారంభంలో శ్రీ గుజ్జా యల్లారావు (సమితి) ప్రసంగిస్తూ, సభ్యులకు ఎజండాను తెలుగులో యివ్వాలని కోరారు.

ఆరోగ్య శాఖాధికారి పట్టణంలో తీసుకున్న కలరా నిరోధక చర్యలను గురించి, ప్రస్తుత కలరావ్యాధి పరిస్థితిని గురించి యిచ్చిన నివేదికను చదివి వినిపించారు.

శ్రీ ఊ. సత్యనారాయణరాజు ప్రసంగిస్తూ, పట్టణంలో అనేకమంది భోజన హోటళ్ళపై ఆధారపడి ఉన్నారనీ, అటువంటప్పుడు భోజన హోటళ్ళు మూసివేస్తే ఏమి ప్రత్యామ్నాయ సౌకర్యం కల్పించారని అడిగారు

శ్రీ దశవాయి సుబ్బరామయ్య (కాం) ప్రసంగిస్తూ, పాలు అత్యవసరం కాబట్టి, పాలఅమ్మకంపై నిషేధం తొలగించాలన్నారు.

శ్రీ టి. శ. విశ్వనాథం (సమితి) మాట్లాడుతూ, మంచినీటి సరఫరాలో కలరావ్యాధి క్రిములు ఉన్నదీ లేనిదీ పరీక్ష చేయించారా? కామెర్ల వ్యాధికి కారణం విచారించారా? అని ప్రశ్నించారు. మొగల్‌రాజపురం, ప్రశాంతి నగర్, మాచవరంలలోని బావులలో క్లోరినేషన్ చేయించాలనీ, కలరా నిరోధక చర్యలు వెంటనే తీసుకోవాలనీ కోరారు.

శ్రీ అడుసుమిల్లి పూర్ణచంద్రరావు (సమితి) ప్రసంగిస్తూ, కృష్ణలంకలోని పల్లపు ప్రాంతాలలో ఉన్న మురుగు నీటిని తోడించివేయాలని సూచించారు. జన సమ్మర్దంగల ప్రాంతంలో కలరా నిరోధక చర్యలు తీసుకోవాలన్నారు.

శ్రీ వి. ప్రకాశరావు (కాంగ్రెసు) మాట్లాడుతూ, మలాన్ని మురుగు కాల్వలో కలుపుతున్నారనీ, దీనిని అరికట్టాలన్నారు.

శ్రీ పొన్నం వీరరాఘవయ్య (సమితి) ప్రసంగిస్తూ, పట్టణంలో కలరా వ్యాప్తికి మంచినీటిలో మలినం కలవటమే కారణమా? అది ఎక్కడ కలుస్తోంది? మంచినీటి గొట్టాలలో మలినం కలిసేచోట్ల ప్రత్యేక ఏర్పాట్లు ఏమైనా చేశారా? అని ప్రశ్నించారు. పబ్లిక్ లెట్రిన్స్ బాగుచేసేందుకు, మలాన్ని చేరవేసేందుకు సిబ్బందిని, వాహనాల్ని ఎక్కువ చేశారా? అనికూడా అడిగారు. మలాన్ని చేరవేయటాన్ని మెకనైజ్ చేయాలన్నారు మురుగునీటి పథకం పూర్తికావటానికి యిప్పుడు అమలు జరుగుతున్న పద్ధతినిబట్టి కనీసం పది సంవత్సరాలైనా పడుతుందనీ, అందువలన తాత్కాలికంగా పల్లపు ప్రాంతాలలోని మురుగునీరు, వర్షపునీరు పోవటానికి ఒక పెద్ద మురుగు కాలవను త్రవ్వటం అవసరమన్నారు.

శ్రీ యల్లారావు (సమితి) మాట్లాడుతూ 6వ వార్డులో ఉన్న సెప్టిక్ ట్యాంకును బాగుచేయించాలన్నారు.

శ్రీ అప్పారావు (సమితి) మాట్లాడుతూ, వీధులలో చెత్తాచెదారం గుట్టలుపడి ఉంటోందనీ, వీటిని చేరవేయటానికి బండ్లు, ఎద్దులు లేవని చెప్పారు. మలాన్ని రాత్రిళ్ళు ఏలూరు కాల్వలో కలుపుతున్నారనీ, దీనిని అరికట్టాలని కోరారు.

శ్రీ గొట్టిపాటి కొండలరావు (సమితి) మాట్లాడుతూ, సిబ్బంది తక్కువగా ఉందనీ, పని ఎక్కువైందన్నారు. గోతులలోఉన్న నీటికుళాయిలను తీసివేసి, ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలన్నారు.

శ్రీ వి. రాజారావు (సమితి)మాట్లాడుతూ ముస్లింపేటలలో ఇంజక్షను యివ్వటానికి లేడీ డాక్టర్లను వేయాలన్నారు 14వ వార్డులోఉన్న భూగర్భమురుగు కాల్వ బాగుచేసి ఇప్పటికి పదకొండు సంవత్సరాలైందనీ, దీనిప్రక్కనే పబ్లిక్ లెట్రిన్ ఉండటంచేత మరింతఅధ్వాన్న స్థితిఏర్పడిందన్నారు.

శ్రీ సంపర తాతబ్బాయి (సమితి) మాట్లాడుతూ 2వ వార్డులో ఉన్న పబ్లిక్ లెట్రిన్ బాగు చేయటానికి సిబ్బందిని ఎక్కువ చేయాలనీ, యీ లెట్రిన్ చుట్టు ప్రక్కల కలరావొచ్చిన విషయం గుర్తుపెట్టుకోవాలన్నారు.

డాక్టర్ విశ్వపతిరావు (కాంగ్రెస్) మాట్లాడుతూ 32 వార్డులో పారిశుధ్య పరిస్థితి బాగుండలేదనీ, ఉన్న పబ్లిక్ లెట్రిన్ పగలగొట్టారనీ, కొత్తది కట్టలేదని తెలియజేశారు. పాలసరఫరాపై నిషేధం కొంత సడలించాలన్నారు

శ్రీ చలసాని వెంకటరత్నం (సమితి) ప్రసంగిస్తూ 30 వ వార్డులోని పల్లపు ప్రాంతాలలోని నీరు వెంటనే తోడించాలనీ, ఆ ప్రాంత ప్రజలకు పబ్లిక్ లెట్రిన్లు లేవనీ, పారిశుధ్య పరిస్థితులు అధ్వాన్నంగా ఉన్నాయనీ, కలరా నిరోధక చర్యలు వెంటనే తీసుకోవాలని కోరారు.

శ్రీ ఊ. రామచంద్రరాజు (సమితి) ప్రసంగిస్తూ, పట్టణంలోని జనాభా దృష్ట్యా యిప్పుడున్న మునిసిపల్ కార్మికులు చాలరనీ, పెంచాలని చెప్తూ, 3వ వార్డులో 12 వేల జనాభాఉంటే మురుగు కార్మికులుమాత్రమే ఉన్నారనీ, వీరు సుమారు 11 మైళ్ళపొడుగు బాగు చేయాల్సి ఉందన్నారు అదేవిధంగా ఒక్కొక్కరు 40 మరుగుదొడ్లు బాగు చేయవలసి వుండగా, 100 దొడ్లవరకు బాగు చేయవలసి వస్తోందన్నారు. మలం డబ్బాలను చేరవేయటానికి తగిన సౌకర్యం కలుగచేయాలనీ, పబ్లిక్ సెప్టిక్ టాంకు లెట్రిన్లు ఎప్పటికప్పుడు బాగుచేయాలన్నారు. ఆరోగ్యశాఖ ఇంజనీరింగుశాఖ మధ్య సమన్వయం లేదనీ, దీనివలన చాలా యిబ్బంది కలుగుతోందనీ చెప్పారు. మంచినీటి పైపులు కొల్లులుపడి మలినం చేరుతోందనీ, భూమిలోపల ఉన్న గొట్టాల విషయం చెప్పనక్కరలేదనీ తెలియజేశారు. పై అధికారులు తనిఖీ చేసే రోడ్లు మాత్రం శుభ్రం చేస్తే చాలదన్నారు.

డాక్టర్ రామారావు, నరసింహారావు, అండమాని బ్రహ్మయ్య, నాసరయ్య గార్లు కూడా మాట్లాడిన తరువాత మునిసిపల్ ఆరోగ్య శాఖాధికారి పూర్తివివరాలను తెలియజేశారు.

ఆరోగ్యశాఖాధికారి రిపోర్టును ఆమోదించి, ఆయన తీసుకున్న చర్యలకు సంతృప్తి ప్రకటించి, పట్టణపారిశుధ్యం బాగుచేయటానికి ఒక సమగ్ర నివేదిక సమర్పించాలని కోరుతూ ఒక తీర్మానాన్ని ఆమోదించారు.

ఎజండాలోని మిగిలిన అంశాలపై చర్చించకుండానే సభను సోమవారం సాయంత్రం 5 గంటలకు వాయిదా వేశారు.

చర్చ మధ్యలో పోతిన చిన్న (కాంగ్రెస్) మాట్లాడుతూ విశాలాంధ్ర పత్రికలో వచ్చిన రిపోర్టును చదివి, దానిపై చర్చప్రారంభించబోగా, ఇది రాజకీయ వేదిక కాదనీ, అది యిక్కడ చర్చించటానికి వీలులేదనీ సమితి సభ్యులు అభ్యంతరం తెలిపారు. అధ్యక్షులు వీరిపై, ఆ విషయం ఇక్కడ చర్చించకూడదని రూలింగు యిచ్చారు.

(వి వి.)

'ఇచ్చి పుచ్చుకునే ధోరణి అవసరం'

లేకపోతే సమస్యలు పరిష్కారం కావని శ్రీ సంజీవరెడ్డి

విశాఖపట్నం, అక్టోబరు 21

ఆంధ్ర రాష్ట్రాన్ని ఎదుర్కొంటున్న ఇర్రిగేషన్ సమస్యలనుగూర్చి ప్రస్తావిస్తూ నిన్న సాయంత్రం ఇక్కడ ముఖ్యమంత్రి శ్రీ సంజీవరెడ్డి "నా వైఖరి ఎల్లప్పుడూ సరి [illegible] వైఖరివల్ల సమస్యలు పరిష్కారం కావు" అన్నారు. ఆంధ్రపట్ల పొరుగు రాష్ట్రాలు [illegible] వున్నాయా లేక ఆంధ్ర ప్రభుత్వ వైఖరిలో ఏమైనా మార్పులు రావాల్సి వుందా అని శ్రీ సంజీవరెడ్డి ప్రశ్నించారు

ఇక్కడి జిల్లా పరిషత్ సమావేశ భవనానికి శంకుస్థాపన చేస్తున్న సందర్భంలో శ్రీ సంజీవరెడ్డి పై విషయాలపై మాట్లాడారు.

ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన జిల్లా పరిషత్ అధ్యక్షుడు శ్రీ సాగి సీతారామరాజు ముఖ్యమంత్రికి స్వాగతం చెప్పారు.

తర్వాత శ్రీ సంజీవరెడ్డి 1959 నుండి సీలేరు ప్రాజెక్టుపై ఆంధ్ర - ఒరిస్సాల మధ్య సంబంధాల చరిత్రను ప్రస్తావించారు. ఇటీవలనే ఈ సమస్యపై ఇచ్చి పుచ్చుకొనే ధోరణిలో ఒప్పందం కుదిరిందనీ, జాతీయ ప్రయోజనాలదృష్ట్యా అన్ని ప్రతిపక్ష పార్టీలతో సమాలోచించి ఈ ఒప్పందం కుదుర్చుకొన్నామని చెప్పారు.

ఈ విషయంలో చాలకాలంగా కేంద్ర ప్రభుత్వంతో జరుగుతున్న ఉత్తర ప్రత్యుత్తరాలతో విసుగెత్తి తానే నిర్ణయానికి వచ్చానని కూడా ఆయన అన్నారు.

సీలేరు విషయంలో వలెనే వివిధ రంగాలలోకూడా రాష్ట్రాన్ని ఎదుర్కొంటున్న అనేక సమస్యల్ని కూడ పరిష్కరించుకోవలెనని ఆశిస్తున్నానన్నారు. అయితే ఇందుకు ఇచ్చిపుచ్చుకొనే వైఖరి అవసరమన్నారు.

వంశధారప్రాజెక్టును వెంటనే ప్రారంభించేందుకు ఒరిస్సా ప్రభుత్వం తన అభిప్రాయాన్ని తెలిపినందుకు శ్రీ సంజీవరెడ్డి ఒరిస్సా ప్రభుత్వానికి కృతజ్ఞత తెలియజేశారు ఈ ప్రయోజనకరమూ, లాభకరంకాని విషయాలలో దేనికి ప్రాధాన్యత ఇవ్వాలన్న విషయమై పునరాలోచించుకునే పద్ధతిలో [illegible] భవన నిర్మాణ సమస్యపై ప్రతిపక్ష నాయకులతో ఒక కమిటీని ఏర్పర్చామన్నారు.

శ్రీకాకుళంలో జిల్లా ఆస్పత్రిని ఏర్పాటుచేయాలని మెడికల్ డైరెక్టర్ కు ఆదేశాలిచ్చామన్నారు. ప్రజలు వివిధ నిర్మాణ కార్యక్రమాల్లో [illegible] తగ్గించుకోవాలని కోరారు.

తరువాత పరిషత్ ఉపాధ్యక్షుడు, ఎం ఎల్. ఏ అయిన [illegible] వందన సమర్పణ చేశారు. విందు అనంతరం సమావేశం ముగిసింది.

అణ్వస్త్ర పరీక్షలపై 30 దేశాల తీర్మానం

జనవరి మొదటి తేదీనుండీ పరీక్షలను నిలిపివేయాలని ప్రతిపాదన

ఐరాస, అక్టోబరు 19

అణ్వస్త్రపరీక్ష లన్నిటినీ ఖండించాలనీ, ఆ పరీక్షలను వెంటనే గాని, లేదా 1963 జనవరి మొదటితేదీనుండిగాని మానివేయాలనీ కోరుతూ, భారతదేశం మొదలయిన ముప్పై తటస్థదేశాలు కలిసి ఐ రా స మహాసభలో నేడొక తీర్మానాన్ని ప్రతిపాదించాయి.

ఆఫ్ఘనిస్తాన్, అల్జీరియా, బొలీవియా, బ్రెజిల్, బర్మా, కాంబోడియా, సింహళం, చిలి, సైప్రస్, ఇథియోపియా, ఘనా, గినీ, భారత, ఇండోనేషియా, ఇరాక్, జోర్డాన్, లావోస్, లైబీరియా, మాలి, మెక్సికో, నేపాల్, నైజీరియా, సోమాలియా, సూడాన్, స్వీడన్, సిరియా, టాంగన్యీకా, ఐక్య అరబ్బు రిపబ్లిక్, వెనిజులా, యుగోస్లావియా దేశాల ప్రతినిధులు కలిసి ఈ తీర్మానాన్ని ప్రతిపాదించాయి

జెనీవాలో జరిగిన పదిహేడు దేశాల నిరాయుధీకరణ సమావేశంలో, అణ్వాయుధ పరీక్షల నిషేధం సమస్యపై ఎనిమిది తటస్థదేశాల ప్రతినిధులు కలిసి చేసిన ప్రతిపాదనను ఐ రా స ఆమోదించాలనికూడా ఈ తీర్మానం కోరుతూంది జెనీవా సమావేశంలో ఆ ప్రతిపాదనను చేసినది భారత, బ్రెజిల్, బర్మా, ఇథియోపియా, మెక్సికో, నైజీరియా, స్వీడన్, ఐక్యఅరబ్బు రిపబ్లిక్ దేశాలు.

"ఆ ఎనిమిది దేశాల ప్రతిపాదనను ప్రాతిపదికగా తీసుకొని, ఈ ఐ రా స మహాసభలో జరిగే చర్చలను దృష్టిలో ఉంచుకొని, పరస్పర అవగాహన, ఇచ్చి పుచ్చుకోలు ధోరణితో సంప్రతింపులు జరిపి, మానవజాతి అత్యవసర ప్రయోజనాల దృష్ట్యా శీఘ్రంగా ఒడంబడిక కుదుర్చుకోవలసిందిగా, ఇందుకు సంబంధించిన వారిని ఆదేశించాలని ఈ ముప్పైదేశాల తీర్మానం కోరుతూంది.

నిరాయుధీకరణ కమిటీ, ఈ సమస్యకు సంబంధించిన దేశాలూ, దీనికి ప్రప్రథమ స్థానమిచ్చి సంప్రతింపులు జరిపి, ఐరాస సర్వసభ్య సమావేశానికి నివేదించాలని కూడా ఈ తీర్మానం కోరుతూంది.

బ్రిటన్, అమెరికాల పన్నాగం

ఈసమస్యపై ఆయా దేశాల రాజధానీ నగరాల్లో దౌత్య ప్రతినిధుల సంప్రతింపులు జరుగుతున్నాయని సాకుచెప్పి, అవి తేలేవరకు ఈ ముప్పై దేశాల తీర్మానాన్ని వాయిదా వేయించడానికి బ్రిటన్, అమెరికా ప్రతినిధులు ఆఖరు నిమిషంలో చేసిన ప్రయత్నం విఫలమయింది

ముప్పై దేశాల తీర్మానం సోమవారంనాడు ఐరాస రాజకీయ ఉపసంఘంలో చర్చకు వస్తుంది. ఆ నాటికి మరికొన్ని దేశాలు కూడా ఈ తీర్మానంపై సంతకాలు చేయవలెనని అనుకుంటున్నారు.

అమెరికా వ్యతిరేకత

ఈ తీర్మానానికి తాము వ్యతిరేకంగా ఓటు చేస్తామని అమెరికా ప్రతినిధి [illegible] చెప్పేశారు.

అణ్వస్త్ర పరీక్షల నిలిపివేతకు తేదీని ఖచ్చితంగా నిర్ణయించడం తమకు ఎంతమాత్రమూ ఇష్టంలేదని పశ్చిమ రాజ్యాలవారు అన్నారు.

'నీటిలో తగిన పాళ్లలోనే క్లోరిన్ కలుపుతున్నాము'

ప్రభుత్వ ప్రకటన

హైదరాబాద్, అక్టోబరు 0

హైదరాబాదులో పంపుచేసే నీరు ఎక్కువగా క్లోరిన్ వాసన వేస్తున్నదనీ, అందువల్ల టీ కాఫీలరుచి పూర్తిగా చెడిపోతున్నదనీ, ప్రజలనుండి వస్తున్న ఫిర్యాదులకు సమాధానంగా కార్పొరేషన్ క్రింది ప్రకటన చేస్తున్నది:

'కర్నూలు, విజయవాడ, మద్రాసు మొదలగు ప్రాంతాలనుండి రైళ్లలో వచ్చే ప్రయాణీకుల మూలంగా రాజధానిలో కలరా వ్యాపించకుండా పంపునీటిలో క్లోరిన్ కలుపుతున్నారు జీర్ణకోశానికి దెబ్బతగిలే మోతాదులో కాకుండా తగు పాళ్ళలోనే కలుపుతున్నారు. ప్రభుత్వ ఆరోగ్య శాఖ పరిశోధనాలయాల్లో ఈ నీటిని పరీక్ష చేస్తున్నారు కూడా. కాబట్టి ప్రజలు ఈ విషయంలో ఆందోళన చెందవలసిన అవసరంలేదు."

ఆయుర్వేద పట్ట భద్రులస్థాయి పెంచడానికి ముఖ్యమంత్రి సుముఖత?

హైదరాబాదు, అక్టోబరు 20

ఆయుర్వేద కళాశాల విద్యార్థుల సమస్యను తాము ముఖ్యమంత్రితో చర్చించామనీ ఆయన వారి స్థాయి పెంచే సమస్యను పరిశీలిస్తానని చెప్పారనీ ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ కమిటీ అధ్యక్షుడు శ్రీ టి. హయగ్రీవాచారి, శాసనసభ డిప్యూటీ స్పీకరు శ్రీ వాసుదేవనాయర్, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి శ్రీ జి. చొక్కారావు నేడొక ప్రకటన చేశారు.

[illegible] ఆయుర్వేద కళాశాలకు [illegible] ఉపాధ్యాయులను [illegible] సమస్యను కూడ పరిశీలిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు వీరు తెలియజేశారు.

ఆరోగ్యశాఖా మంత్రి, ప్రభుత్వ ఆరోగ్యశాఖ కార్యదర్శి ప్రస్తుతం రాజధానిలో లేరు కాబట్టి వారువచ్చిన తరువాత ఈ సమస్యలపై చర్చ జరిపి తగుచర్య తీసుకొంటామనీ ఈ లోగా విద్యార్థులు సమ్మె విరమించాలని ముఖ్యమంత్రి తరువాత చెప్పినట్లు వీరు ప్రకటనలో వెల్లడించారు.

వీరి హామీపైన విద్యార్థులు సమ్మెను విరమించిన విషయం పాఠకులకు విదితమే

ఆసుపత్రి నుండి విద్యార్థుల విడుదల

నిరశనవ్రతం సాగిస్తున్నందుకు ఆత్మహత్యకు పూనుకొన్నారనే ఆరోపణపై అరెస్టుచేసి ఉస్మానియా ఆసుపత్రిలో వుంచిన ఆరుగురు ఆయుర్వేద కళాశాల విద్యార్థులు నేడు ఆసుపత్రి నుండి విడుదలయ్యారు. పూచీ ఖత్తులపై సంతకాలు చేయించుకొని పోలీసులు వీరిని వదలిపెట్టారు.

ఉద్యోగులకు తెలుగులో పరీక్షలు

హైదరాబాదు, అక్టోబరు 20

జిల్లాల్లో తెలుగు మాతృభాష కాని ప్రభుత్వోద్యోగులకు తెలుగుభాష పరీక్షలు 1962 డిసెంబరులోనో లేక 1963 జనవరిలోనో జరపాలని ప్రభుత్వం నిశ్చయించింది.

హైదరాబాదు సికింద్రాబాదులోని ప్రభుత్వోద్యోగులకు ఈ పరీక్షలు 1963 ఏప్రిల్ లో జరుపుతారు.

టపాకాయలు రోడ్లపై ప్రేల్చరాదని ఉత్తర్వు

హైదరాబాదు, అక్టోబరు 20

దీపావళి పండుగ సందర్భంలో టపాకాయలు రోడ్లపైన ఇతర ప్రజలు ఉపయోగించే ఇతరబహిరంగ స్థలాల్లో ప్రేల్చరాదని హైదరాబాదు పోలీసు కమిషనర్ నేడు సిటీ పోలీసు చట్టం క్రింద ఉత్తర్వు చేశారు.


గ్రాము [illegible]
టెలిఫోన్ 264712
263325
ఇత్తడి ఊచలు
ఉచిత కటింగు & టర్నింగు నాణ్యతకు
[illegible] కాసింగు [illegible]
[illegible] బొంబాయి-1

సంపాదకవర్గం. [illegible] హనుమంతరావు (అధ్యక్షుడు), కొత్తగడ్డ రాజగోపాలరావు, ఏటుకూరు బలరామమూర్తి. విశాలాంధ్రవిజ్ఞాన సమితితరపున ఎడిటర్, ప్రింటర్ అండ్ పబ్లిషర్ కొత్తగడ్డ రాజగోపాలరావు, [illegible] ప్రెస్, విజయవాడ-4